RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 262 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 అక్టోబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## బీజేపీ ఎన్నికల మిషన్ కాదు: మోదీ

న్యూఢిల్లీ: బీజేపీ ఎన్నికల మిషన్ కాదని, అలా చెప్పడం పార్టీని అవమాన పరచడమేనని, పార్టీ కార్యకర్తల కృషి, ధైర్యం ఫలితంగానే ఎన్నికల్లో గెలుపు ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతి కలలను తీర్మానాలుగా రూపొందించుకుని, వాటిని సాధించడం, అందుకోసం పూర్తి అంకితభావంతో పనిచేయడం చేయాలన్నారు. ఏ పార్టీని ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చారో ఆ పార్టీ ప్రజాస్వామిక విలువలకు కట్టుబడుతూ, అంతర్గత ప్రజాస్వామ్యానని కాపాడుకోవాకోవాల్సి ఉంటుందన్నారు. పార్టీకి ఎన్నో తరాలవారు తమ జీవితాలను వెచ్చించారని, ఆ ఫలితమే ఈరోజు ప్రజల గుండెల్లో కమలం చిరస్థాయిగా నిలిచిందని గుర్తుచేశారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం– 'సంఘటన్ పర్వ, సదస్యత అభియాన్ 2024' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ప్రధాని ప్రసంగించారు.





# ఆర్టీసీ ఛార్జీల పెంపు దుమారం

హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండగ అయ్యింది. ఫెస్టివల్ కోసం ఊరెళ్లిన వారంతా తిరుగు ప్రయాణం అవుతున్నారు. ముందుగా టికెట్ బుక్ చేసుకుంటే ఫర్లేదు. టికెట్ బుక్ చేసుకోలేదా..? అంతే సంగతులు. ప్రైవేట్ ట్రావెల్స్ చేతిలో మోసపోవడం ఖాయం. తెలంగాణలో పెద్ద పండగ దసరా. ఫెస్టివల్ కోసం సిటీ నుంచి చాలా మంది ఊరు వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్స్ ఇప్పటికే బుక్ అయ్యాయి. స్పెషల్ బస్సుల్లో ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్, కార్లు అందినకాడికి దోచుకుంటున్నాయి.

**ఛార్జీల పెంపు..** ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీల గురించి మాజీమంత్రి హరీశ్ రావు స్పందించారు. 'పండగ కోసం ఊరు వెళ్లి, తిరిగి సిటీకి వచ్చే వారికి ఆర్టీసీ బస్సుల్లో అధిక చార్జీ వసూల్ చేస్తున్నారు.

బస్సుల సంఖ్యను ఏమాత్రం పెంచలేదు. పైగా టికెట్ ధరలు పెంచి ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారు అని' హరీశ్ రావు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. టికెట్ రేట్ల పెంపు గురించి సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. హరీశ్ రావు ట్వీట్‌కు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు.

**పెంచలేదే...** 'ఆర్టీసీ బస్సు ఛార్జీలు ఎప్పటిలాగే ఉన్నాయి. స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఎక్కువ ఛార్జీలు ఉన్నాయి. పండగ సమయాల్లో జిల్లాలకు వెళ్లిన స్పెషల్ బస్సులు తిరుగు ప్రయాణంలో ఖాళీగా వస్తాయి. ఖాళీగా వచ్చే స్పెషల్ బస్సులకు డీజిల్ ఖర్చుల కోసం ఛార్జీలను పెంచాం. చార్జీల పెంపు ఇప్పుడు ప్రవేశ పెట్టలేదు. 2003 నుంచి స్పెషల్ బస్సులకు ఛార్జీలు పెంచుకునే సదుపాయం ఉంది. పండుగ సందర్భంగా నడిచే 500 స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఎక్కువ ఛార్జీలు ఉన్నాయి. 8500 రెగ్యులర్ బస్సుల్లో సాధారణ ఛార్జీలే అమల్లో ఉన్నాయి అని' ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు.

**స్కూళ్లు, కాలేజీలు ఓపెన్...** దసరా పండగ శనివారం వచ్చింది. ఆదివారం సెలవు.. కొందరు పండగను సండే జరుపుకున్నారు. మంగళవారం నుంచి స్కూళ్లు, కాలేజీలు రీ ఓపెన్ అవుతాయి. ఈ క్రమంలో సోమవారం నుంచి బస్సుల్లో రద్దీ నెలకొంది. తెలంగాణలో ఏ టౌన్ బస్ స్టాప్‌లో అయినా సరే జనం గుమిగూడి ఉన్నారు. బస్సుల కోసం, బస్సుల్లో సీట్ల కోసం చూస్తున్నారు. ఇప్పటికే మెజార్టీ బస్సుల్లో సీట్లను ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నారు. దాంతో మిగతా వారు వేచి చూడక తప్పడం లేదు.




## తెలంగాణలో ధూంధాంగా దసరా దావత్.. 10 రోజుల్లో రూ.1,100 కోట్ల మందు తాగేశారు

హైదరాబాద్: తెలంగాణలో దసరానాడు ముక్క, సుక్క లేకుండా పండగ పూర్తి కాదు. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్ లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది.

**17 లక్షల బీర్లు..** రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. ఈ సారి అదే అంచనాతో ముందుగానే ఎక్సైజ్ శాఖ అధికంగా మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. ఆర్డర్లు కూడా ఊహించిన దాని కన్నా అధికంగా ఉండటంతో రాష్ట్ర సర్కార్ ఖజానాకు కాసుల వర్షం కురిసింది. బార్లు సైతం తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి.

**స్వల్పంగా తగ్గిన ఆదాయం..** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో పది రోజులకుగానూ అమ్మకాలు కాస్త తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, 2023లో మద్యం అమ్మకాల ద్వారా రూ.317 కోట్ల 21 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ.312 కోట్లే ఖజానాకు వచ్చింది. గతంతో పోల్చితే ఎక్సైజ్ ఆదాయం రూ.5 కోట్ల 18 లక్షలు తగ్గడం గమనార్హం.




# సీఎం క్లారిటీతో డైలమాలో బీఆర్ఎస్

## సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిన గులాబీ పార్టీ

హైదరాబాద్ : బీఆర్ఎస్ ఒక్కసారిగా గప్‌చుప్ అయింది. జనాల్లోకి వెళ్లేందుకు ఆ పార్టీకి అస్త్రం కరువైంది. నిన్నటివరకు రుణ మాఫీ, హైడ్రా, మూసీపై స్పీడ్ పెంచిన గులాబీ పార్టీ సీఎం క్లారిటీతో ఒక్కసారిగా డైలమాలో పడింది. రెండు రోజులుగా మూసీపై ఫీల్డ్ విజిట్ బంద్ చేసిందనే ప్రచారం జరుగుతోంది. ఏ అంశంతో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాలనే సమాలోచనలో గులాబీ అధిష్టానం పడింది.

**సైలెంట్ మోడ్‌లోకి బీఆర్ఎస్ :** హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళనపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. కాలుష్యం నుంచి ప్రజల ప్రాణాలను కాపాడటానికి 'డబుల్' ఇండ్లు ఇచ్చి, రూ.25 వేల నగదు సాయం, పిల్లలకు మంచి స్కూల్‌లో చదివించేలా చర్యలు తీసుకుంటూ.. వారి ఆత్మగౌరవాన్ని పెంచుతున్నామని సీఎం వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడాలన్న ఉద్దేశంతోనే హైడ్రా, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులను తీసుకొస్తున్నామని వివరించారు. దీంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా సైలెంట్ అయింది. నిన్నటివరకు రుణమాఫీ, హైడ్రా, మూసీపై స్పీడ్ పెంచింది. ఇండ్లు కోల్పోతున్న మూసీ పరివాహక ప్రాంతాల్లో లీడర్లు పర్యటించారు. వారికి భరోసా కల్పించారు. అయితే సీఎం వ్యాఖ్యలతో సీన్ రివర్స్ అయింది. ఎలా ముందుకెళ్లాలో అర్థం కాక పార్టీ సతమతమవుతోంది. ఏ అస్త్రంతో ప్రజల ముందుకెళ్లాలనే డైలమాలో పడినట్లయింది.

**అనారోగ్యం బారిన పడ్డ కేటీఆర్! :** మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇండ్లు కోల్పోతున్న, రెడ్ మార్క్ వేస్తున్న ఇండ్ల బాధితులదగ్గరకు వెళ్లేందుకు పార్టీ ప్లాన్ చేసింది. కానీ విజిట్ చేయలేదు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముషీరాబాద్ పర్యటనకు వెళ్లిన సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. మరోవైపు కేటీఆర్ సిక్ అయినట్టు సమాచారం. దీంతో పర్యటనకు బీఆర్ఎస్ నేతలు వెళ్లలేదు. బాధిత ప్రజలంతా కొంత నిరాశకు గురయ్యారు. అయితే ఫీల్డ్ విజిట్ ఆగిపోయిన దానిని తిరిగి కొనసాగిస్తారా? లేదా? అనే చర్చ కొనసాగుతోంది. రాబోయే గ్రేటర్ ఎన్నికలకు ఈ పర్యటన కలిసి వస్తుందనుకున్న తరుణంలో సీఎం రేవంత్ మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు హామీ ఇవ్వడంతో దానిని తిరిగి ఎలా తిప్పికొట్టాలనే ప్రణాళికలు గులాబీ రచిస్తున్నట్టు సమాచారం.

**ఏ అంశంపై ముందుకెళ్లాలనే విషయమై పార్టీ ఆరా! :** ప్రజల్లోకి ఏ అంశంతో వెళ్లాలనే దానిపై గులాబీ పార్టీ డైలమాలో పడింది. ఇప్పటికే మీడియా వేదికగా 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై నిలదీస్తున్న బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటించలేదు. కేవలం విమర్శలకే పరిమితమయింది. క్షేత్రస్థాయిలో ఏ అంశంతో వెళ్లితే ప్రజల నుంచి ఆశించిన స్పందన వస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసొస్తుందనే విషయాలపై పార్టీ ఆరా తీస్తున్నట్టు సమాచారం. పెన్షన్, రైతు, మహిళా సమస్యలా? ఏదైతే బాగుంటుందనే దానిపైనా పలువురు లీడర్ల నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్టు సమాచారం. దసరా తర్వాత పార్టీ కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతూ..క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటుందనే ప్రచారం జరుగుతోంది. పార్టీ ఎలాంటి నిర్ణయాలతో ముందుకు వెళ్తుందనేది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

**రుణమాఫీపై సాగదీత? :** బీఆర్ఎస్ పార్టీ గత కొంతకాలంగా రుణ మాఫీ అంశాన్ని ఎత్తుకుంది. సందర్భం ఏదైనా ఇదే అంశంపై మాట్లాడుతోంది. అయినా ప్రభుత్వం చేస్తున్నది.. చేయాలనుకున్నదే చేస్తూ ముందుకు వెళ్తోంది. ఎంతమందికి రుణమాఫీ చేశాం.. ఎంతమందికి చేయాల్సింది.. ఎందుకు ఆలస్యమవుతుందనే వివరాలను ప్రభుత్వపరంగా వెల్లడిస్తున్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ మాత్రం అదే అంశాన్ని సాగదీస్తూ ముందుకు వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే ఇప్పటికే రెండు మూడు నియోజకవర్గాల్లో స్థానిక నేతల ఇంట్రెస్టుతో మండలకేంద్రాల్లో రైతు ధర్నాలు నిర్వహించారు. ఆ ధర్నాల్లో రుణమాఫీ, రైతుబంధు అంశాలను ప్రస్తావిస్తున్నప్పటికీ రైతుల నుంచి ఆశించిన స్పందన రాలేదనే ప్రచారం జరుగుతోంది.

# త్వరలో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తాం: మంత్రి సీతక్క

హైదరాబాద్: సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్‌ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించారు . ఈ సందర్భంగా మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరెట్ హెల్ప్ లైన్‌లో పదిమందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, దివ్యాంగులు, వయోవృద్ధులు, సాధికారత శాఖా జేడీ శైలజ, వికలాంగ సంఘాల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువగా ఉన్నాయని.. ఇతర వర్గాల వారిలా ఫైట్ చేయాలంటే ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయని, శారీరకంగా వచ్చే లోపం మన చేతిలో లేదని అన్నారు. పోషకాహార లోపం, ప్రమాదం వల్ల వికలాంగులుగా మారే ప్రమాదం వుందన్నారు. అందుకే వాళ్లకు ఉపాది అవకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌ను ప్రారంభించామని మంత్రి తెలిపారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు పాటించాలని, దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే చాలని అన్నారు. వారి అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తాయని, అందుకోసమే పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సంక్షేమ నిధుల నుంచి ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నామని, ప్రైవేట్ ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రయత్నిస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. గతంలో ఒక శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి పెంచెందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు పాటిస్తామని చెప్పారు. సంక్షేమం, విద్యా, ఉద్యోగ రంగంలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని స్పష్టం చేశారు. దివ్యాంగుల పరికరాల కోసం ఈ ఏడాది బడ్జెట్లో రూ. 50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దివ్యాంగులు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా మాకే.. వారి సమస్యలను షేర్ చేయొచ్చునని, మెసేజ్ పాస్ చేస్తే చాలని.. వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని, చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలుపెట్టామని మంత్రి సీతక్క తెలిపారు. దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం చేయూతనిస్తామని చెప్పారు. కాగా మహిళా శిశు సంక్షేమ డైరెక్టరేట్ కాల్ సెంటర్లో పదిమంది దివ్యాంగులకు మంత్రి సీతక్క అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేశారు. సుహాసిని –హెల్ప్ లైన్ అడ్మినిస్ట్రేటర్, ఎం. లక్ష్మి –ఐ టి సూపర్‌వైజర్, కాల్ ఆపరేటర్లుగా మామిడి లావణ్య, కే. లలిత, పార్వతమ్మ , మేడి శ్రీకాంత్, కే. నాగలక్ష్మి, ఎం. రజిత, సిహెచ్ సుమిత్ర తదితరులు.



## సంపాదకీయం

# ఇజ్రాయెల్ ఆ చిన్న దీవి మీద టార్గెట్ చేస్తే.. ప్రపంచానికి ఆయిల్ సంక్షోభమే

ఒక చిన్న దీవి మీద ప్రపంచ ఆయిల్ అవసరాలు గడుస్తున్నాయా? అన్న ప్రశ్న వేసుకుంటే దానికి సమాధానం అవుననే చెప్పాలి. ఆ చిన్న దీవి ఇరాన్ అధీనంలో ఉంది. ఇరాన్ ను దెబ్బ తీయాలని భావించే ఇజ్రాయెల్ కానీ.. ఆ దీవి మీద దాడి చేసిందా? ప్రపంచానికి గడ్డు పరిస్థితులు దాపురించినట్లే. ఆ దీవి మీద దాడి జరిగినంతనే.. పెట్రోల్.. డీజిల్ ధరలు భగ్గుమనటమే కాదు.. మరిన్ని సమస్యలు ఎదురవుతాయి. ఇంతకూ ఆ దీవి ఎక్కడ ఉంది? దాని ప్రత్యేకత ఏమిటి? ఎందుకంత ప్రాధాన్యం? లాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికితే.. ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తాయి. పర్షియన్ గల్ఫ్ లోని ఇరాన్ తీరానికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఖర్గ్ అనే చిన్న దీని ఉంది. అదే ఇరాన్ కు ఆయువుపట్టు. ఇక్కడి నుంచే భారీ ఎత్తున క్రూడాయిల్ ఎగుమతులు జరుగుతుంటాయి. ప్రపంచంలో పెద్ద దిగుమతిదారుగా ఉన్న చైనాకు కూడా ఇక్కడి నుంచే ముడి చమురు ఎగుమతి అవుతుంది. తనపై ఇరాన్ చేసిన దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ కానీ ఈ దీవిని లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తే మాత్రం.. ప్రపంచానికి గడ్డు పరిస్థితులు దాపురించినట్లే. దీనికి కారణం.. ఇక్కడి నుంచే ఇరాన్ కు చెందిన పలు దీవుల ద్వారా చమురు ఎగుమతి అవుతు ఉంటుంది. పర్షియన్ గల్ఫ్ లో ఉన్న ఇతర దేశాలైన బ్రహాయిన్.. ఖతార్.. కువైత్.. సౌదీలకు చెందిన చమురు ఎగుమతి టెర్మినల్స్ ఈ తీర ప్రాంతంలోనే ఉన్నాయి. మరో ముఖ్యమైన అంశం.. హెర్ముజ్ జలసంధి. ఇక్కడి నుంచే పర్షియన్ గల్ఫ్ లోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఇది కూడా ఇరాన్ అధీనంలోనే ఉంది. ఒకవేళ ఇరాన్ కానీ ఈ జలసంధిని మూసివేస్తే.. అంతర్జాతీయంగా చమురు సంక్షోభం తలెత్తక మానదు. గతంలో జరిగిన ఇరాక్ – ఇరాన్ యుద్ధంలో సద్దాం హుస్సేన్ సేనలు ఈ దీవి మీద దాడి చేయటంతో.. అప్పట్లో తీవ్రమైన ఆయిల్ సంక్షోభం ఎదురైంది. తమపై 200 బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసిన ఇరాన్ కు తగిన పాఠం చెప్పాలని ఇజ్రాయెల్ తపిస్తోంది. ప్రతీకార దాడులు తప్పవని ఇప్పటికే ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఇరాన్ పై తమ దాడికి ప్లాన్ చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ సైతం ఇజ్రాయెల్ కౌంటర్ ఎటాక్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయటం తెలిసిందే. అదే సమయంలో ఇరాన్ లోని అణుకేంద్రా లపై దాడి వద్దని సూచన చేశారు. దీం తో.. ఇరాన్ పై ఇజ్రాయెల్ పై దాడి చేస్తే ఎక్కడ దాడి చేస్తుంది? దాని టార్గెట్ ఏమిటన్నది చూసినప్పుడు.. "ఖర్గ" మీద ఫోకస్ పెట్టే అవకాశాలు ఎక్కువగా చెప్పొచ్చు.

# సోషల్ మీడియా ద్వారా పచ్చి అబద్ధాలు..

**సోషల్ మీడియాను సెన్స్ లేని మీడియగా తయారు చేస్తున్న బి అర్ ఎస్ నాయకులు..**
**నిజామాబాద్ ను స్మార్ట్ సిటీ దిశగా కృషి చేస్తాం..**
**రాష్ట్ర పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్..**



నిజామాబాద్ : సోషల్ మీడియా ద్వారా హరీష్ రావు, కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, సోషల్ మీడియాను సెన్స్ లేని మీడియగా బీ అర్ ఎస్ నాయకులు తయారు చేస్తున్నారని రాష్ట్ర పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహి ంచిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేస్తూ దుబాయ్ నుంచి సోషల్ మీడియాను రన్ చేస్తున్నారని, ప్రజలకు అసలు విషయం దాచి పక్రీకరించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం కంటే కూడా ఎక్కువ రుణమాఫీ చేశామని గుర్తు చేశారు.రైతు రుణ మాఫీ కి మీరు ఇచ్చిన నిధులు ఎంత ? మేము ఇచ్చిన నిధులు ఎంతని హరీష్ రావు, కేటీఆర్ తెలుసుకోవాలని, అబద్ధాలు ప్రచారం చేయడం మంచిది కాదని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. తప్పుడు ప్రచారం తాత్కాలిక ఆనందం ఇచ్చినా దీర్ఘకాలికంగా బి అర్ ఎస్ కు నష్టం జరుగుతదని జోస్యం చెప్పారు. ఒక పద్ధతి పాడు లేకుండా పోస్ట్ లు పెడుతూ అసత్య ప్రచారం చేయడం సరికా దని, ప్రజలు నిజా నిజాలు తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని, ప్రజల కోసమే సంక్షేమ పథకాలు తీసుకువచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నమని అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో లేని హామీలను కూడా అమలు చేస్తున్నామన్నారు. నీళ్ళు,నిధులు, నియామకాల కోసం యూపీయే ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 50 వేల వరకు ఉద్యోగాలు కల్పించామని, కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో 30 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.రుణ మాఫీ విషయంలో ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. పదేళ్లలో బి అర్ ఎస్ ఇచ్చిన రుణమాఫీ ఎంత, కాంగ్రెస్ 9 నెలల్లో ఇచ్చిన రుణ మాఫీ ఎంత అర్థం చేసుకోవాలని అసలు విషయం తెలుసుకోకుండా నిందలు చేస్తున్నారన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి ఇచ్చారన్నారు. జిల్లా పారిశ్రామిక అభివృద్ధి పై త్వరలో సిఎం తో చర్చిస్తామని, ప్రాణహిత 20, 21 ప్యాకేజీ పనులు వేగవంతం చేస్తామన్నారు. జిల్లాకు మరో మెడికల్ కళాశాల ఆవశ్యకత ఉందని, జిల్లాలో మంచి స్టేడియం నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బిజెపి, బి అర్ ఎస్ లు ప్రజలను మభ్యపెడుతున్నారు. అర్ ఓ బి విషయం లో కేంద్రం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తుందని అన్నారు. నిజామాబాద్ స్మార్ట్ సిటీ రావల్సిన అవసరం ఉందని అందుకు ఎంపీ అరవింద్ ఆ దిశగా కృషి చేయాలన్నారు.వీలైనంత త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అన్నారు. జిల్లా సీనియర్ నాయకులతో కలిసి జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్,నగర కాంగ్రెస్ అధ్యక్షులు, నుడా చైర్మన్ కేశ వేణు, ఆర్మూర్ ఇన్చార్జి వినయ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, సిరిసిల్ల గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, ప్రచార కమిటీ మెంబర్ జావేద్ అక్రమ్,పీసీసీ మాజీ కార్యదర్శి రం భూపాల్, సేవాదళ్ సంతోష్,ఓబీసీ నరేందర్ గౌడ్,బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేటర్ రోహిత్,అడ్వకేట్ రామకృష్ణ, అబ్దుల్ ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిక..

## మాక్లూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాంగ్రెస్ లో చేరిక..



నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం రూరల్ క్యాంప్ కార్యాలయంలోమాక్లూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివ లింగం రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ మేరకు రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని అన్నారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కష్టపడిన నాయకులకు కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ పని తీరు మెచ్చి పార్టీలో చేరడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శివలింగం మాట్లాడుతూ.. డాక్టర్ భూపతి రెడ్డి తో తనకు ఎంతో సాహిత్యం ఉందని, ప్రజా సమస్యలు తన దృష్టికి తీసుకువెళ్తే పరిష్కరించారని, ఆయన సమక్షంలో పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. మాక్లూర్ మండలంలో, జిల్లాలో లో తనకున్న పరిచయాలతో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రాజేందర్, మహేష్ పాల్గొన్నారు.

# గౌడ కులస్తుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి అభివృద్ధికి పార్టీలు అడ్డు కావొద్దు

నిజామాబాద్ : గౌడ సంఘ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో రేణుక పట్టణ గౌడ సంఘ భవనం మహేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ సంఘ అభివృద్ధి కోసం తన వంతు ప్రత్యేక కృషి చేస్తానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో చర్చించి నిజామాబాద్ లో గౌడ సంఘం అభివృద్ధి కోసం భవనాల నిర్మాణం కోసం ప్రత్యేక నిధులువెచ్చించి మంజూ రు చేయిస్తామని అన్నారు.

ఇప్పటికే కొన్ని నిధులు మంజూరు అయ్యాయని మరికొంత అభివృద్ధి కోసం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిధులు కేటాయిం చడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రాంతాల అభివృద్ధికి రాజకీయ పార్టీలు అడ్డుగా మారొద్దని పార్టీలకతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం రాజకీయ పార్టీ నాయకులుముందుకు



రావాలని పిలుపునిచ్చారు. గౌడ సంఘం సత్యనారాయణ గౌడ్, డిసిసి అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నూడ చైర్మన్ కేశవేణు, మాజీ పిసిసి కార్యదర్శి నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగుస్తున్న సీనియర్ రెసిడెంట్ల శిక్షణ



గోదావరిఖని : రాష్ట్రవ్యాప్తంగా బోధనాసుపత్రుల్లో వైద్యుల కొరత ఉన్నప్పటికీ సీనియర్ రెసిడెంట్ల సేవలతో కొంతమేరకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. ఈ నేపథ్యంలో వారి ఏడాది గడువు పూర్తికావడంతో ఈనెల 30న వారు విధుల్లోంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయా బోధనాసుపత్రుల్లో వైద్య సేవలకు విఘాతం ఏర్పడనుంది. వైద్యవిద్యలో ఎండీ, ఎంఎస్ తదితర పీజీ కోర్సులు పూర్తిచేసిన సీనియర్ రెసిడెంట్లు.. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాదికాలం సేవలందించాల్సి ఉంటుంది. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక(బోధన) ఆసుపత్రిలో 33మంది సీనియర్ రెసిడెంట్లు 3న విధుల్లోంచి తప్పుకోనున్నారు.

**కథ మళ్లీ మొదటికి..**

గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మొత్తం 57మంది స్మీనియర్ రెసిడెంట్లు పనిచేయాల్సి ఉండగా.. గత ఏడాది కాలంగా కేవలం 33 మంది మాత్రమే ఉన్నారు. సాధారణంగా ఒక శిక్షణ బృందం పూర్తయ్యేలోగా మరో బృందం విధుల్లోకి రావాలి. అయితే కొవిడ్ నేపథ్యంలో పీజీ ప్రవేశాలు, పరీక్షల్లో నెలకొన్న జాప్యంతో ఒక్కో బృందానికి సుమారు ఐదారు నెలలు పడుతుంది. అయితే ఆసక్తి గలవారిని యథావిధిగా కొనసాగించడం.. లేదంటే ఖాళీల ప్రకారంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఒప్పంద విధానంలో నియమించుకునేందుకు ఆయా ఆసుపత్రి వర్గాలు సమాలోచిస్తున్నాయి.

**ముఖాముఖికి స్పందన కరవు**

గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సార్వజనిక ఆసుపత్రిలో ఆచార్యులు, సహా, సహాయక ఆచార్యులు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్ల నియామకానికి మూడు రోజులు ముఖాముఖి నిర్వహించారు. అయితే మానవ శరీర నిర్మాణ శాస్త్రం, కమ్యూనిటీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫిజియాలజీ తదితర నాన్ క్లినికల్ విభాగాల్లో ఎవరూ రాలేదు. దీంతో వారికిచ్చే భృతిని మరో రూ.50వేలకు పెంచుతూ ముఖాముఖికి మరో రెండు రోజులు గడువు పెంచారు. వివిధ విభాగాల్లో ఒప్పంద విధానంలో నియామకానికి ప్రకటన జారీ చేయగా.. గత మూడు రోజుల్లో సుమారు 50 మంది హాజరయ్యారు.

భర్తీ అయ్యేలా చూస్తాం

డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

పూర్తిస్థాయిలో వివిధ విభాగాల్లోని పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నాన్ క్లినికల్ విభాగంలో అభ్యర్థులు ముందుకు రావడం లేదు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ముఖాముఖికి సుమారు 50 మంది హాజరుకాగా.. పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేసేలా చర్యలు తీసుకుంటాం.

# తూంకుంటలో ఇందిరమ్మ కమిటీల ముఖ్య నాయకుల సమావేశం


శామీర్పేట, (గరుడ వార్త) : నేడు ఇందిరమ్మ కమిటీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహిస్తున్నట్లుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ సోమవారం తెలిపారు. శామీర్ పేట మండలం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్హాల్లో ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి చెందిన వివిధ పథకాలకు సంబంధించి నూతనంగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకై కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి టీపీసీసీ ఉ పాధ్యాక్షు



డు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్టీ వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకరౌడ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్రెడ్డి లు విచ్చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి శామీర్ పేట మండలం, తూంకుంట మున్సిపల్లోని కాంగ్రెస్ పార్టీ మ ఖ్యనాయకులు, పార్టీ కి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు తప్పని సరిగా హాజరై విజయవంతం చేయాలని వైఎస్ గౌడ్ కోరారు.

# నేడు అంగరంగ వైభవంగా శ్రీరేణుక ఎల్లమ్మ కళ్యాణం

శామీర్ పేట (గరుడ వార్త): శ్రీరేణుక ఎల్లమ్మ కళ్యాణం నేడు వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. మండల కేంద్రం శామీరలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలోని బొడ్రాయి, గ్రామ దేవతలకు బోనాలను నిర్వహించారు.





సాయంత్రం గంగతెప్పను డోలు వాయిద్యాలతో ఊరేగించి ఆలయం వద్ద వదిలారు. మంగళవారం ఉదయం ఘటం తీయుట, లందకు వెల్లుట నిర్వహిం చనున్నారు. అనంతరం 11.45 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం నిర్వహిను న్నట్లు చెప్పారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామం నుంచి సామూహికం గా అమ్మవారికి బోనాలను ఊరేగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని నిర్వహకులు కోరారు.

# అతివలకు రుణ సాయం

గజ్వేల్ : స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళా సంఘాల సభ్యులు చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ప్రతి నెలా రుణ వాయిదాలను బ్యాంకుల్లో చెల్లిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సిద్దిపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 4,168 మహిళా సంఘాలు ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం 653 సంఘాలకు రూ.66.13కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు.



పనితీరు ఆధారంగా స్వశక్తి సంఘాల సభ్యులు ప్రతి నెలా కొంత మొత్తాన్ని బ్యాంకులో పొదుపు చేస్తుంటారు. సంఘాల పనితీరు, పొదుపు ఆధారంగా బ్యాంకులు రుణాలు అందిస్తాయి. ప్రతి సంఘానికి వారి అవసరం మేరకు అర్హత ఆధారంగా రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. వీటిని పొందిన సభ్యులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తూ ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి: హనుమంత్ రెడ్డి, మెప్మా పీడీ

మహిళా సంఘాల సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలి. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఎప్పుడూ ముందుంటాం. బ్యాంకు అధికారుల సహకారంతో లక్ష్యాన్ని త్వరలో చేరుకుంటాం.

# ఇదేం వైరస్?

కరీంనగర్ : జిల్లాలో జ్వర బాధితుల సంఖ్య తగ్గడం లేదు. పండగలో సంతోషంగా గడపాల్సిన కుటుంబాల్లో జ్వర పీడితులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. చికున్‌గన్యా లక్షణాలతో అనేక మంది మంచం పడుతున్నారు. డెంగీ జ్వరాలతో విలవిలలాడుతున్నారు. కుటుంబంలో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉంటే అందరినీ జ్వరాలు చుట్టుముడుతున్నాయి. పెద్దవాళ్లలో కొందరికి అయితే జ్వరంతో పాటు శరీరంపై దద్దుర్లు తేలి బాధపడుతున్నారు. వాతావరణ మార్పులకు తోడు, తగ్గని జ్వరాలకు కారణమైన వైరస్‌ను అధికారులు తేల్చుకోలేకపోతున్నారు.

ఆందోళనలో వైద్య ఆరోగ్యశాఖ..

వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు రావడం సహజంగానే ఉంటుంది కానీ.. ఈసారి మాత్రం రోగ నిర్ధారణ కాకపోయిన అవే లక్షణాలతో ప్రజలు మంచానపడటం వైద్య ఆరోగ్య శాఖను ఆందోళనలకు గురిచేస్తోంది. ఇప్పటి వరకు వర్షాలు కూడా అంతంత మాత్రంగా ఉన్నాయి. అక్టోబర్‌లో చలి ప్రారంభం కావాల్సి ఉన్నా పరిస్థితి కాస్త భిన్నంగా ఉంది. ఉదయం కొంత చలిగా ఉంటూ 10 గంటల తర్వాత ఎండ వేడి, ఉక్కపోత ఉంటోంది. మధ్యలో వర్షం చినుకులు పడుతూ వాతావరణం హైరానా పెడుతోంది.

జిల్లాకు చెందిన ముఖ్య అధికారిణి నాలుగు రోజుల క్రితం విపరీతమైన ఒంటి నొప్పులు, జ్వరంతో వైద్యులను సంప్రదించారు. రక్త నమూనాలు సేకరించి చికున్‌గన్యాగా అనుమానంతో నిర్ధారణకు పంపించగా నెగెటివ్ అని తేలింది. కాని అవే లక్షణాల ఆధారంగా తగిన మందులు వాడుతూ కోలుకుంటున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఓ అధికారికి జ్వరం వచ్చింది. సాధారణ



మందులు వాడి కోలుకున్నారు. మంగళవారం విధుల్లో భాగంగా గ్రామాలకు వెళ్లి వచ్చిన తర్వాత శరీరం, ముఖంపై దద్దుర్లు రావడంతో భయపడి అవసరమైన నిర్ధారణ పరీక్షలు చేయిస్తే ఏమీ నిర్ధారణ కాలేదు. మందులు వాడుతున్నారు.

ఓ రైతు రెండు నెలల క్రితం తీవ్ర జ్వరంతో వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకున్నారు. నడవలేని స్థితి కారణంగా చికున్‌గన్యాగా భావించినా నిర్ధారణ కాలేదు. ఆయన ఇప్పటికి అదే పరిస్థితిలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

భగత్‌నగర్‌కు చెందిన బాలుడు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడ్డాడు. వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు. చివరికి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరు రోజులపాటు వైద్యం అందివ్వగా కోలుకున్నాడు.

జిల్లాలో జనవరి నుంచి అక్టోబరు వరకు..

డెంగీ నిర్ధారణ పరీక్షకు సేకరించిన నమూనాలు 11,668

నిర్ధారణ జరిగినవి 124

చికున్‌గన్యా నిర్ధారణ పరీక్షలకు సేకరించిన నమూనాలు 374

నిర్ధారణ జరిగినవి 3

నమూనాలు పంపాం

సుజాత, డీఎంహెచ్‌వో

జిల్లాలో నిర్ధారణ కాకపోయినా ఎక్కువ మంది చికున్‌గన్యా లక్షణాలతో బాధపడుతున్నారు. జిల్లాలో కొందరి రక్త నమూనాలు సేకరించి అయిదు రోజుల క్రితం పుణెలోని వైరాలజీ విభాగానికి పంపాం. నిర్ధారణ కాలేదు. మళ్లీ పంపాం. వైరస్‌ను తేల్చాల్సి ఉంది. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

జాగ్రత్తలే సరైన మందు

ఆగస్టు నుంచి పిల్లల్లో జ్వరాలు పెరిగాయి. కొందరు శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. డెంగీ లక్షణాలతో వస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. వీటన్నింటికి జాగ్రత్తలే సరైన మందు. ముఖ్యంగా జలుబు, దగ్గుతో ఉన్నవారిని ఇతర పిల్లలకు దూరంగా ఉంచాలి. వారికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలి. పరిశుభ్రమైన నీరు తాగించాలి. కట్ల చైతన్య, పిల్లల వైద్య నిపుణులు

# క్యూ లేకుండా.. 'కి'యోస్క్‌లు

హైదరాబాద్: నిమ్స్ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్(ఓపీ) విభాగాల వద్ద క్యూలు చూస్తేనే రోగులకు సగం నీరసం వచ్చేస్తుంది. ఓపీ లభించినా వైద్యుడి పిలుపు అందుకునే సరికి మధ్యాహ్నం దాటుతుంది. ఇక టెస్టులు రాస్తే.. ఫలితాలు వచ్చేది సాయంత్రమే. మళ్లీ వైద్యుడికి చూపించుకోవడానికి రెండో రోజు వరకు ఆగాల్సిందే.



చాలామంది క్యూలు చూసి వెనుతిరుగుతున్న సందర్భాలు అనేకం. నిమ్స్‌లో 30వరకు విభాగాలు ఉండగా...నిత్యం 2వేల మంది ఓపీ సేవల కోసం వస్తుంటారు. సోమ, మంగళ, బుధవారాల్లో ఓపీ విభాగాలు కిటకిటలాడుతుంటాయి. ఇక వీరికి ఉపశమనం లభించనుంది. విజయదశమి సందర్భంగా ఓపీ విభాగాల వద్ద కొత్తగా కియోస్కోలను అందుబాటులోకి తేనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. తొలుత నాలుగు ప్రాంతాల్లో అందుబాటులోకి రానున్నాయి.

ఆన్‌లైన్‌లో.. అనువైన సమయంలో..

ఉద్యోగ ఇతర బాధ్యతల వల్ల కొందరికి అనారోగ్యం ఉన్నప్పటికీ వైద్యునికి చూపించుకోవడానికి సమయం దొరకదు. కొన్నిసార్లు సమయం ఉన్నా సరే.. వైద్యుడు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి. ఆసుపత్రికి వెళ్తే వెనుతిరగాల్సి వస్తుంది. ఇలాంటి వారి కోసం ఆన్‌లైన్ ఓపీ సేవలు ప్రవేశపెట్టనున్నారు. నిమ్స్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈ సేవలు పొందవచ్చు.

# చదువొక్కటే కాదు.. ఎన్నెన్నో



హైదరాబాద్ : "విషయం అర్థంకాకుండా రాత్రింబవళ్లు పుస్తకాలు చదివితే ఆయాసం తప్ప మరేం రాదు. అందుకే ఓ గంటసేపు నృత్యం చేయండి. పాటలు పాడండి. తీరొక్కపూలతో బతుకమ్మ చుట్టూ ఆడండి.. గదిలో మీరొక్కరే ఉన్నారనుకుని మీకిష్టమైన రాగంలో పాట పాడండి" అని జేఎన్‌టీయూ అధికారులు ప్రథమ సంవత్సరం విద్యార్థులతో చెబుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) తరహాలో విద్యార్థుల అభిరుచులకు అనుణంగా 12 క్లబ్‌లను ఏర్పాటుచేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు క్లబ్‌ల్లో రెండింటిని తప్పనిసరిగా ఎంచుకోవాలి. బాగా నేర్చుకున్నాక సదరు విద్యార్థులకు క్రెడిట్ పాయింట్లు ఇవ్వనున్నారు. సమకాలీన అంశాలపై విద్యార్థుల మనోగతాన్ని తెలుసుకోనున్నారు. ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి కనీసం రెండు క్లబ్‌లలో వారు నేర్చుకున్న అంశాల్లో నిష్ణాతులుగా మారనున్నారని జేఎన్‌టీయూ అధికారులు చెబుతున్నారు.

మీకు నచ్చిందే నేర్చుకోండి

ఐఐటీల్లో ఇంజినీరింగ్ తొలి సంవత్సరంలో చేరే విద్యార్థులు దేశం నలుమూలల నుంచి వస్తున్నారు. వీరికి ఆహారం, వసతి అన్నీ భిన్నంగా ఉంటాయి. కొత్తలో తరగతులకు వెళ్లినా ఇబ్బందులే. వీటన్నింటినీ వారు అధిగమించేందుకు క్లబ్‌లను ఏర్పాటుచేశారు. ఇవి సత్ఫలితాలిస్తుండటంతో ఇక్కడ 12 క్లబ్‌లను ఏర్పాటుచేశారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ భ్రమర.. వీటిని పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా 'ఆర్ట్ మేకరీ,' ఎలైట్ ఫీట్, రాగవర్ష, కోడింగ్ క్లబ్, ఫొటోగ్రఫీ వంటి అంశాల్లో రెండింటిని ఎంపిక చేసుకోవాలి.

ఇష్టంగా చదవాలన్న లక్ష్యంతో

– ప్రొఫెసర్ భ్రమర, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం

విద్యార్థులు వారి సబ్జెక్టులు ఇష్టంగా చదవాలన్న లక్ష్యంతో ఈ క్లబ్‌లను ప్రారంభించాం. చదువుతోపాటు చుట్టూ ఉన్న ప్రపంచం వారికి తెలియాలి. ప్రథమ సంవత్సరం పూర్తయ్యేలోపు ఆల్ రౌండర్‌గా ఎదగాలన్నదే మా ధ్యేయం. ప్రతి క్లబ్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఇంటర్ వరకు భయపడుతూ చదివే పిల్లలకు.. ఇంజినీరింగ్‌లో ఒకేసారి అపరిమిత స్వేచ్ఛ లభిస్తుంది వీరి ఆలోచనలను సరైన దిశలో మళ్లించేందుకు క్లబ్‌లను ప్రారంభించాం.

సంగీతం, చిత్రలేఖనం, ఛాయాచిత్రం

జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థుల్లో చాలామంది సంగీతం, చిత్రలేఖనం, ఛాయాచిత్రాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారని అధికారులు తెలిపారు. చరవాణుల్లో ఫొటోలు తీసి వాటికి ప్రత్యేకతలను అదనంగా జత చేర్చినట్లే ఫొటోగ్రఫీ క్లబ్‌లో ఫొటోలను సృజనాత్మకంగా తీస్తున్నారు. ఇందులో సాంకేతిక అంశాలను వివరించేందుకు ఫొటోగ్రాఫర్లతో తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు సంగీతం, చిత్రలేఖనం అంశాల్లోనూ శిక్షణ ఇవ్వనున్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులకు ఈ క్లబ్‌లలోనే 'కృత్రిమ మేధ' 'కోడింగ్' 'డేటాసైన్స్' 'ఐసీఈ' వంటి క్లబ్బులను ఏర్పాటుచేసి శిక్షణ ఇవ్వనున్నారు. సంగీతం, చిత్రలేఖనం, నృత్యం వంటి అంశాల్లో పోటీ పరీక్షలు నిర్వహించి ప్రోత్సాహకంగా చిన్నచిన్న బహుమతులను అందజేస్తున్నారు. ఆసక్తి ఉన్న రెండు అంశాల్లో నిష్ణాతులయ్యేలా రూపకల్పన

# పెళ్లి బాజా.. ఖర్చుల మోత



హైదరాబాద్: గ్రేటర్‌లో పెళ్లి సందడి మొదలైంది. మూడు నెలల పాటు మంచి ముహూర్తాలే ఉండటంతో పెళ్లి వేదికల బుకింగ్‌లు, కేటరింగ్, దుస్తులు, బంగారం కొనుగోళ్లతో వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. వివాహమనేది జీవితంలో మరుపురాని ఘట్టం కావడంతో కలకాలం గుర్తిండిపోయేలా.. అందరూ గుర్తుంచుకొనేలా చేయాలనుకుంటున్నారు. దేశవ్యాప్తంగా 48 లక్షల పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. వీటి కోసం రూ.6 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ సర్వేలో వెల్లడించింది. ఇందులోని వివరాల ప్రకారం గ్రేటర్‌లో ఈ సీజన్‌లో 5 వేల పెళ్లిళ్లు జరుగుతుండగా...రూ.625 కోట్లకు పైగా వ్యాపారం జరగనుంది.

పెళ్లిళ్ల ఖర్చులు సగం సగమంటూ ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇలా 59శాతం పెళ్లిళ్లలో జరుగుతోందని 'వెడ్ మి గుడ్' అనే సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. 32శాతం మంది సొంతంగానే ఖర్చులు భరిస్తున్నట్టు వెల్లడించింది.

నిశ్చితార్థం నుంచి మొదలుకొని పెళ్లితంతు ముగిసే వరకు డెకరేషన్ చేసేవాళ్లు, డీజే సంగీతం, బ్యాండ్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, శామియానా, పురోహితులు, కేటరింగ్, పత్రికలు, దుస్తులు, బంగారం కొనుగోళ్లు, మేకప్, మెహందీ ఆర్టిస్టులు ఇలా అనేక మందికి ఉపాధి దొరుకుతోంది.

అన్నీ పెరిగాయ్..

గతంతో పోల్చితే అనేక విభాగాల్లో ఖర్చులు పెరిగాయి. పెళ్లి వేదికల ఖర్చు గతంలో రూ.50వేల నుంచి రూ.7–8లక్షల వరకు ఉండగా ప్రస్తుతం రూ.75వేల నుంచి రూ.10లక్షలకు పెరిగింది. ప్లేటు భోజనానికి గతంలో రూ450 – రూ.1000 ఉంటే అది రూ.700 – రూ.1500 వరకు పెరిగింది. కూరగాయలు, నిత్యవసరాల ధరలు పెరగడంతో ప్లేటు భోజనానికి అయ్యే ఖర్చు పెరిగిందని కేటరింగ్ సేవల ప్రతినిధులు తెలిపారు.

భోజనం 'ఆహా' అనిపించేలా...భోజనాల్లో కనీసం 15 నుంచి 20 రకాలు అందుబాటులో ఉండాలని ఎక్కువ మంది భావిస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కేటరింగ్ సర్వీసుల వాళ్లు ఇరువర్గాలకు సంబంధించి ఐదు నుంచి పది మందిని పిలిచి వేర్వేరు వంటకాలను అప్పటికప్పుడు వండి రుచి చూపిస్తున్నారు. శాకాహారంలో.. ఉత్తర, దక్షిణ భారతదేశ వంటకాలను ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. వెజ్ స్టార్టర్‌లలో పనీర్, మంచూరియా ఉండాలని కోరుతున్నారు, వెజ్ బిర్యానీ, బొబ్బట్లు, పనీర్ కూర, మూడు పచ్చళ్లు, ఇతర కూరగాయలు, ఉలవచారు, సాంబార్, రైతా, రెండు నుంచి మూడు పొడులు, ఐస్‌క్రీమ్, ఖద్దూ కా కీర్, గులాబ్ జామూన్, ఖుబానీ కా మీఠా, వీటితో పాటు పానీపూరీ, ఇడ్లీ, దోశ వంటి అల్పాహారం ఉండాలని కోరుతున్నారు. మాంసాహారంలో మటన్, చికెన్, చేపలు, రొయ్యలతో చేసిన 3 నుంచి 4 వెరైటీలు ఉండేలా చూసుకుంటున్నారు.

# అయ్యో.. భీమారం..!



కేతేపల్లి : ఆ రహదారి సమస్య ఎన్నో ఏళ్ల నాటిది. మూడు నియోజకవర్గాలను కలుపుతూ విస్తరించి ఉన్నా.. విస్తరణకు నోచుకోవట్లేదు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో దశాబ్దాలుగా కొత్త రహదారి నిర్మాణానికి నోచుకోవట్లేదు. సరైన మరమ్మతులకు కూడా అడుగు ముందుకు పడటంలేదు. ఇది సూర్యాపేట నుంచి భీమారం మీదుగా మిర్యాలగూడకు వెళ్లే రహదారి దుస్థితి.

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన సూర్యాపేట– మిర్యాలగూడ పట్టణాల మధ్య కేతేపల్లి మండలం భీమారం మీదుగా ఉన్న రహదారి అభివృద్ధి పనులు ఏళ్లతరబడి పూర్తి కావడంలేదు. దీంతో ప్రతినిత్యం ఆ రహదారిపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి సూర్యాపేట, నకిరేకల్, మిర్యాలగూడ శాసనసభా నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. అయినా.. ఈ పనిని పూర్తిచేసే విషయంలో సంబంధిత ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

పదేళ్ల క్రితం ప్రారంభమైన రెండు వరుసల రహదారి పనులు మూడు, నాలుగు సార్లు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని.. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ధరలు పెంచాలనే సాకుతో గుత్తేదారు పనులను నిలిపివేశారు. పనులు మొత్తం పూర్తయితేనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు సంబంధిత గుత్తేదారుడితో తేల్చి చెప్పారు. కొత్త రహదారి పనులు పూర్తికాక.. పాత రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. చాలా చోట్లా కేవలం కంకర పోసి బీటీ వేయకుండా వదిలేశారు.భీమారం నుంచి శెట్టిపాలెం వరకు వంతెన పనులు నిలిపేశారు. వంతెనల వద్ద రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఇటీవల వంతెన కుంగిపోవడంతో సూర్యాపేట– మిర్యాలగూడ పట్టణాల మధ్య రెండుమూడు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమస్య తీవ్రంగా ఉన్నా.. ఈ రహదారిపైన దృష్టి సారించడంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ అధికార పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ప్రస్తుతం సూర్యాపేట మినహా మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు అధికార పార్టీకి చెందిన వారే ఉన్నా.. రహదారి పనులు పూర్తి చేయించడంలో ఆశించిన స్థాయిలో చొరవ చూపడం లేదనే ఆరోపణలున్నాయి.


చర్యలు తీసుకుంటాం

రహదారిలో ప్యాచ్‌వర్కులు, వంతెనల నిర్మాణం, అసంపూర్తి పనులు పూర్తిచేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. అన్నింటినీ సమీక్షించి రహదారి పనులు పూర్తి చేయిస్తాం.సత్యనారాయణరెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ

# రుడా దిశగా అడుగులు

గోదావరిఖని : రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటుకు వేగంగా చర్యలు చేపడుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం కసరత్తు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించింది. పెద్దపల్లి, మంథని పురపాలక సంఘాలతోపాటు.. రామగుండం నగరపాలక సంస్థను అలాగే కమాన్‌పూర్, రామగిరి, అంతర్గాం, పాలకుర్తి, ఎండపల్లి, ధర్మారం మండలాలను కలుపుకుని 'రుడా' ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం కసరత్తు పూర్తిచేసింది. దీని పరిధిలో సుమారు 6 నుంచి 7 లక్షల జనాభా ఉండే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. భారీ పరిశ్రమలకు నిలయమైన పెద్దపల్లి జిల్లాలో 'రుడా' ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దాదాపుగా అన్ని రకాలుగా కసరత్తు చేసింది.

పంచాయతీలు యథావిధిగా..రుడా ఏర్పాటుతో పంచాయతీల స్వయం



ప్రతిపత్తికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం యథావిధిగా అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు రుడా ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. రామగుండం.. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ప్రత్యేక నిధులు విడుదలవుతాయి. స్థానికంగా వసూలుచేసే వివిధ రకాల పన్నులను కూడా ఇక్కడే అభివృద్ధి కోసం వెచ్చించుకునే అవకాశం ఉంటుంది. మౌలిక సదుపాయాలు, తాగునీటి సమస్యలపై అదనంగా నిధులు కేటాయించనున్నారు.బి–కేటగిరీ నగరంగా గుర్తింపు..

రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో బి–కేటగిరి నగరంగా గుర్తించనున్నారు. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇది వర్తిస్తుంది. గ్రామాలు కూడా పట్టణీకరణకు నోచుకోనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనాల్లో పెరుగుదల ఉంటుంది. తాత్కాలిక కార్మికులకు సంబంధించి సౌకర్యాలు పెరిగే అవకాశమూ ఉండనుంది. రుడా పరిధిలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంటు ఫ్యాక్టరీ, జెన్‌కో విద్యుత్తు కేంద్రాలు ఉండటంతో మరిన్ని నిధులు అభివృద్ధి కోసం వెచ్చించుకోవచ్చు.

వచ్చే క్యాబినెట్‌లో ఆమోదం


వచ్చే మంత్రివర్గ సమావేశంలో 'రుడా' ఏర్పాటుకు ఆమోదం తెలపనున్నారు. దీనివల్ల ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు వచ్చే అవకాశముంది. పట్టణీకరణ పెరుగుతుంది. రుడా వల్ల ఎవరికి ఇబ్బంది ఉండదు. కొంతమందిలో అపోహలున్నాయి. రుడాతో ఏ గ్రామానికి నష్టం జరగదు. అభివృద్ధి చేసుకోవడానికి నిధుల కొరత ఉండదు. రుడా పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలకు దీని నిధులు కేటాయించుకోవచ్చు.మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే

# అదను చూసి బకాయిల వసూళ్లు

సిరిసిల్ల : సహకార విద్యుత్తు సరఫరా సంఘం అధికారులు బకాయిల వసూళ్లను ముమ్మరం చేశారు. భారీగా ఉన్న వాటిని రాబట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే సిబ్బంది రంగంలోకి దిగారు. గత కొన్ని నెలలుగా చెల్లించని వినియోగదారులు విడతల వారీగా చెల్లించేందుకు అవకాశం కల్పించారు. అయినా ముందుకు రాని వారి విద్యుత్తు కనెక్షన్‌ను తొలగిస్తున్నారు. ఇలా మొత్తం బకాయిలు వసూలు చేసి నష్టాలు నుంచి సెస్‌ను గట్టెక్కించేందుకు చర్యలు చేపడుతున్నారు.

సెస్‌కు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం రూ.139.75 కోట్లు ఉన్నాయి.వివిధ కేటగిరీలకు చెందిన వినియోగదారులు బకాయిలను చెల్లించాల్సి ఉంది. వీరిలో కేటగిరీ–1 కింద అంటే గృహ వినియోగదారులే ఎక్కువగా ఉన్నారు. అన్ని రకాల కనెక్షన్‌లు 2,65,443 ఉండగా, ఇందులో గృహ వినియోగదారులకు సంబంధించినవి 1,64,929 ఉన్నాయి.

బకాయిలు వసూలు చేయాలనే లక్ష్యంతో అధిక మొత్తంలో ఉన్న



వినియోగదారులు దశల వారీగా చెల్లించేందుకు సెస్ అధికారులు అవకాశం కల్పించారు. ప్రభుత్వం 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్తు వినియోగదారులకు ఉచిత విద్యుత్తును ప్రకటించింది. గృహజ్యోతికి అర్హులుగా ఎంపికైన వారిలో చాలా మంది ఎంపికకాక ముందు చాలా నెలలుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. గృహజ్యోతికి ఎంపికైన వారు ప్రతి నెలా ఉచితంగా విద్యుత్తును పొందుతున్నారు. అయినా పాత బకాయిలు చెల్లించడం లేదు. ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్న వారు ఒకేసారి చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారు మూడు, నాలుగు విడతల్లో చెల్లించడానికి వీలు కల్పించారు.

కట్టడానికి ముందుకు రాకపోతే విద్యుత్తు కనెక్షన్ తొలగిస్తున్నారు. దీంతో బకాయిలు చెల్లించే వరకు చీకట్లో ఉంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సెస్‌కు వివిధ కేటగిరీల వినియోగదారుల నుంచి మొత్తం రూ.139.75 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీరిలో చాలా మంది ఎక్కువ మొత్తంలో కట్టాలి. ఒకేసారి చెల్లించడానికి ఇబ్బందులు పడతారు. దీనికోసం వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా మూడు, నాలుగు విడతల్లో చెల్లించడానికి అవకాశం కల్పించాం. ఈ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. బకాయిలు కట్టని వారి విద్యుత్తు కనెక్షన్‌ను తొలగిస్తాం.శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ

# సూర్యఘర్‌కి అవినీతి మరక

హైదరాబాద్ : పీఎం సూర్యఘర్‌కి అవినీతి మరక అంటింది. గృహాలపై సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే చాలు తనిఖీల పేరుతో మీటర్ జారీ, బిగింపు వరకు ప్రతి దశలో కొందరు రెడ్కో అధికారులు, డిస్కం సిబ్బంది కొందరు దబాయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏజెన్సీల నుంచి వీటిని వసూలు చేస్తున్నా.. అంతిమంగా ఆ భారం వినియోగదారులపై పడుతోంది.

ఇదీ పథకం: ఇళ్లపై సౌర విద్యుదుత్పత్తితో ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు పొందేందుకు కేంద్రం పీఎం సూర్యఘర్ పథకం తీసుకొచ్చింది. 3 కిలోవాట్ల సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవాలంటే రూ.2,06,400 అవుతుంది. నెట్‌మీటర్‌కు



రూ.2950, సబ్సిడీ దరఖాస్తుకు రూ.1770 చెల్లించాలి. ప్రభుత్వం నుంచి నేరుగా వినియోగదారుడి ఖాతాకు రూ.78వేల సబ్సిడీ వస్తుంది. సబ్సిడీ కాకుండా వినియోగదారుడు 3 కిలోవాట్లకు తమ జేబు నుంచి రూ.1,33,120 వ్యయం చేస్తున్నారు.

లంచాలు ఇవ్వకపోతే..: తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) నోడల్ ఏజెన్సీగా ఉంది. ఇళ్లపై ఏజెన్సీలు సౌర ఫలకలు ఏర్పాటు చేసిన తర్వాత రెడ్కో జిల్లా మేనేజర్లు తనిఖీ చేసి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడే 3 కిలోవాట్ల ప్లాంట్ తనిఖీకి కొందరు మేనేజర్లు రూ.5వేలు వసూలు చేస్తున్నారు. కిలోవాట్‌కు వెయ్యి అన్నారు కదా అని ఎవరైనా అంటే.. తనిఖీల్లో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్తు పంపిణీ సంస్థలో మరొక విధంగా వసూళ్లు చేస్తున్నారు. సింగిల్ ఫేజ్, త్రిఫేజ్ మీటర్ల ఆధారంగా వసూలు చేస్తున్నారు. నెట్ మీటర్ జారీ కావాలంటే అక్కడ ఉన్న కొందరు సిబ్బంది వెయ్యి దాకా తీసుకుంటున్నారు.

# పైసా వసూల్

హైదరాబాద్: హైదరాబాద్ చుట్టూ ఉన్న చెరువుల హద్దుల్లో బఫర్‌జోన్లను కొందరు నీటిపారుదలశాఖ అధికారులు మార్చారని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులు గుర్తించారు. ఐటీకారిడార్.. శంషాబాద్ విమానాశ్రయం... బాహ్యవలయ రహదారుల పరిసర ప్రాంతాల్లో జలవనరులు.. చెరువుల బఫర్‌జోన్లలో ఈ మార్పులు చేర్పులు చేశారు. రెండు జిల్లాల నీటిపారుదల శాఖ అధికారుల్లో కొందరు సహకారం అందించారు. ఎఫ్‌టీఎల్.. బఫర్‌జోన్ హద్దులను గుర్తించేక్రమంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఇక్కడ ఇలా: రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలో 1820 చెరువులుండగా... 10శాతం చెరువుల ఎఫ్‌టీఎల్లు, బఫర్‌జోన్లు మారిపోయాయంటూ స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గం, ఖాజాగూడ చెరువుల




బఫర్‌జోన్లలో వాణిజ్య సముదాయాలు వెలిశాయి.

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రెండు చెరువులను పూడ్చేసి విల్లాలు నిర్మిస్తున్నారు.పట్టించుకోరని..: సహజసిద్ధమైన నీటివనరులు, చెరువులు అధికంగా ఉన్న గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్, కూకట్‌పల్లి, మేడ్చల్, ఉప్పల్, ఘట్‌కేసర్ మండలాల్లో నీటిపారుదలశాఖ అధికారులు చెరువుల బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లు మార్చేశారు గండిపేట మండలంలో ఒక చెరువు బఫర్‌జోన్‌కు వెలుపల రియల్ వెంచర్ ప్రతినిధులు విల్లాలు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారు. ఇక్కడ 18 విల్లాలను నిర్మించారు.

మేడ్చల్ మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో రెండు చెరువుల్లో కొన్నేళ్ల నుంచి ప్రవాహం ఆగిపోవడంతో బఫర్‌జోన్‌ను 20 మీ. వెనక్కి జరిపారు. ఇరిగేషన్‌శాఖ ఇళ్లకు నిరభ్యంతర పత్రాలు ఇచ్చింది.

# హైడ్రా నిఘా ఎల్ఆర్ఎస్‌కు సెగ

హైదరాబాద్: హైడ్రా దెబ్బకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. గతంలో బల్దియా, హెచ్ఎండీఏ ఇతర మున్సిపాలిటీల పరిధిలో దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేవారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను పెద్దగా పట్టించుకోలేదు. చెరువు సమీపంలో ఉంటే మాత్రం వాటిని తిరస్కరించేవారు. హైడ్రా కొరడా ఝుళిపిస్తుండటంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో నీటిపారుదల, రెవెన్యూ శాఖలను కూడా భాగస్వామ్యం చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏలో 3.58 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండిం



గ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 200 దరఖాస్తులలోపే అనుమతులు ఇచ్చారు. చాలా లేఅవుట్లు చెరువు శిఖం, బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. ఇప్పుడు గత రెండు దశాబ్దాల చెరువు ఎఫ్‌టీఎల్, పంచాయతీ మ్యాపులను పరిశీలిస్తున్నారు. సంబంధిత విభాగాల నుంచి ఎన్ఓసీ తీసుకున్న తర్వాత మరోసారి హెచ్ఎండీఏ అధికారులు తనిఖీలు చేసి ఎలాంటి ఇబ్బందులు లేవని నిర్ణయానికి వచ్చిన తర్వాత దరఖాస్తులను ఎల్ఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు.

# చదువే లోకం.. పుస్తకంతో మమేకం



కరీంనగర్: సర్కారు కొలువుల ఆశలు నెరవేర్చే గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా యువత సన్నద్ధమవుతున్నారు.. కోరుకున్న కొలువును సాధించాలనే కృతనిశ్చయంతో రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఉండటంతోపాటు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2, 3 పరీక్షలను నవంబరు, డిసెంబరులో నిర్వహిస్తామని ప్రకటించడంతో ఉన్న సమయానికి అనుగుణంగా సన్నద్ధమవుతున్నారు.

**లక్ష మందికి పైగా..**

గ్రూప్స్, బ్యాంక్ ఉద్యోగాలు, ఇతర పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్షమందికిపైగా ఉద్యోగార్థులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో దాదాపుగా 30శాతం మంది మాత్రం గ్రంథాలయాలు, రీడింగ్స్ రూమ్‌లకే పరిమితమవుతున్నారు. ఈ ఏడాది జూన్ 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు నాలుగు జిల్లాల పరిధిలో 29,151 మంది రాశారు. ఇందులో అర్హత సాధించిన వారు అక్టోబరులో నిర్వహించనున్న మెయిన్స్‌కు సిద్ధమవుతున్నారు. ఇలా గ్రూప్-1 తోపాటు గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను దాదాపుగా 80 వేల మంది వరకు రాసే అవకాశముంది.

**అధికారుల సూచనలిలా..**

లక్ష్యం నిర్దేశించుకోవడమే కాదు.. అందుకు వారు ప్రణాళికాబద్ధంగా కృషి చేశారు.. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదివారు.. వివిధ క్యాడర్ అధికారులుగా స్థిరపడ్డారు.. అక్టోబరు.. నవంబరు.. డిసెంబరులలో గ్రూప్-1, 2, 3 పరీక్షలు ఉన్న నేపథ్యంలో వారితో మాట్లాడగా ఉద్యోగార్థులకు విలువైన సూచనలిచ్చారు..

**అదనపు సమయం కేటాయించండి**

భావన

ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. అయినా ఇంజినీరింగ్ వైపు వెళ్లకుండా డిగ్రీ చదివి, గ్రూప్స్ పరీక్షలు రాయాలని నాన్న అన్నారు. మొదటి నుంచి ప్రభుత్వ అధికారిగా ఎక్కువ మందికి మేలు చేయవచ్చనే ఆలోచన ఉండటంతో సన్నద్ధమయ్యా. మాది ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం. అమ్మా-నాన్న భారతి, చిన్నయ్య. 2015లో హైదరాబాద్‌లో బీఎస్సీ పూర్తి చేశాక.. అక్కడే గ్రూప్-2కు 8 నెలలు శిక్షణ తీసుకున్నా. నిత్యం 10 నుంచి 12 గంటలు చదివేది. ఎన్ని గంటలు చదివామన్నది కాదు.. చదివింది ఎంత గుర్తుంచుకున్నామన్నది ముఖ్యం. 2016లో పరీక్ష రాయగా 2019లో ఫలితాలు విడుదలై 2020లో ఎన్పీడీసీఎల్ రెవెన్యూ రికవరీ అధికారిగా పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు గ్రూప్-2 రాసేవారికి తక్కువ సమయం ఉంది. కొత్త పుస్తకాల జోలికి వెళ్లకుండా ఇప్పటి వరకు చదివిన వి పునశ్చరణ చేసుకోండి. సిలబస్ పూర్తి కాకుంటే అదనపు సమయం కేటాయించుకుని చదవండి.

భావన, ఎన్పీడీసీఎల్, కరీంనగర్ సర్కిల్

**ఇది పునశ్చరణ సమయం..**

మాది జగిత్యాల జిల్లా కొడిమ్యాల. మేము ముగ్గురం అక్కచెల్లెళ్లం. అక్క ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. చెల్లి బ్యాంకు అధికారిగా పని చేస్తున్నారు. 2006లో ఎంకాం, బీఈడీ పూర్తి చేసిన తరువాత డీఎస్సీ కోసం సన్నద్ధమయ్యా. ఇదే సమయంలో గ్రూప్-2 కోసం ప్రయత్నించగా మొదటి ప్రయత్నంలోనే వాణిజ్య పన్నుల శాఖలో ఏసీటీవోగా ఉద్యోగం సాధించా. తరవాత గ్రూప్-1 కోసం 2011లో మే నుంచి సెప్టెంబరు వరకు హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నా. తక్కువ సమయం ఉండటంతో రోజుకు 14 గంటల పాటు చదివేది. 2011 సెప్టెంబరులో జరిగిన గ్రూప్-1 పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు రాగా నిర్మల్ ఆర్డీవోగా పోస్టింగ్ అభించింది. ప్రస్తుతం గ్రూప్-1, 2, 3 సిద్ధమవుతున్నవారు ఉన్న తక్కువ సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా కష్టపడాలి. ఇది పునశ్చరణ సమయం. ప్రతి నిమిషం విలువైనదే.. పక్కా ప్రణాళిక వేసుకుని చదువుకుంటూ నోట్స్ రాసుకోవాలి. గతంలో చదివినవన్నీ పునశ్చరణ చేసుకోవాలి.

జె. అరుణశ్రీ, జిల్లా అదనపు పాలనాధికారి, పెద్దపల్లి

**అంశాలపై స్నేహితులతో చర్చించండి..**

మాది ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం వింజపల్లి. కరీంనగర్‌లో డిగ్రీ చేసిన తరవాత ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో టీటీసీ చేసి కొడిమ్యాల మండలంలో ఉపాధ్యాయురాలిగా చేరా. పత్రికల్లో అధికారుల స్ఫూర్తి కథనాలు చదివి ప్రభుత్వ అధికారిని అయితే ఎక్కువ మంది ప్రజలకు సేవ చేయొచ్చని భావించి గ్రూప్-2కు సన్నద్ధమయ్యా. 2010లో గ్రూప్-2 సాధించి కరీంనగర్‌లో సీనియర్ అకౌంట్స్ అధికారిగా ఉద్యోగం పొందా. ప్రస్తుతం సిరిసిల్లలో ఉప కోశాధికారిగా విధులు నిర్వహిస్తున్నా. ఇప్పుడు సిలబస్‌లో బాగా మార్పు వచ్చింది. ముఖ్యంగా సమకాలీన అంశాలు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమం గురించి లోతుగా అధ్యయనం చేయండి. మీలాగే సన్నద్ధమవుతున్న స్నేహితులతో వివిధ అంశాలపై చర్చ పెట్టుకోవడం ద్వారా మరింత బాగా గుర్తుంచుకోవచ్చు.

అన్నాడి కవిత, ఉప కోశాధికారి, సిరిసిల్ల

**ఉన్న సమయానికి ప్రణాళిక వేసుకోండి..**

మాది చొప్పదండి. బీఎస్సీ, బీఈడీ పూర్తయిన తరువాత 2004లో డీఎస్సీ రాసి రెండో ర్యాంకుతో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా నియమితులయ్యా. అదే సమయంలో స్నేహితుల ప్రోత్సాహంతో గ్రూప్-2కు సిద్ధమయ్యా. రోజూ 10 గంటలు చదివేవాడిని. పాత పరీక్ష ప్రశ్నాపత్రాలను అధ్యయనం చేసి చదివేది. జోన్‌లో 2 ర్యాంక్ సాధించడం ద్వారా 2009లో గంభీరావుపేట మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా చేరా. ప్రస్తుతం గ్రూప్-2 సన్నద్ధమయ్యేవారికి తక్కువ సమయం ఉంది. హడావుడి పడొద్దు. సిలబస్ పూర్తి చేసి ఉంటే సరి. లేదంటే ఉన్న సమయాన్ని పకడ్బందీగా వాడుకోవాలి. ముఖ్యమైన అంశాలు చదువుకోవడంతోపాటు పునశ్చరణకు సమయం కేటాయించాలి.

బొద్దుల గంగయ్య, ఆర్డీవో, పెద్దపల్లి

# చెరువుల శిఖం కబ్జా.. యథేచ్ఛగా నిర్మాణాలు



పెద్దపల్లి: కబ్జారాయుళ్లు చెరువు శిఖాలను వదలడం లేదు. కాదేదీ కబ్జాకు అనర్హమనే చందంగా చెరువు శిఖం, బఫర్ జోన్లలోనూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. రాష్ట్ర రాజధానిలో నీటివనరులను ఆక్రమించి చేపట్టిన అక్రమ కట్టడాలను హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేస్తున్నారు. ఇదే తరహాలో రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల్లో చెరువులను కబ్జా చేసే వారిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలో చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పలు కట్టడాలను కూల్చివేశారు. ఆయా నిర్మాణాలను అక్రమార్కులు మళ్లీ చేపట్టారు.ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎన్ని అక్రమ కట్టడాలు ఉన్నాయి? ఎన్ని కూల్చివేశారు? అనే విషయాలను పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్‌తో 'ఈనాడు' ప్రస్తావించింది. బంధంపల్లి వద్ద రెండు నిర్మాణాలు మాత్రమే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పూర్తిస్థాయిలో గుర్తించాల్సిన బాధ్యత నీటిపారుదల శాఖ అధికారులపై ఉందన్నారు. ఇదే విషయాన్ని జిల్లా నీటిపారుదలశాఖ పర్యవేక్షక ఇంజినీర్(ఎస్ఈ) సత్యరాజ్‌చంద్ర వద్ద ప్రస్తావించగా సుల్తానాబాద్‌లో గర్రెపల్లి, పెద్దపల్లిలో బంధంపల్లి, రామగుండంలో మల్కాపూర్ చెరువుల వద్ద గతంలో ఎఫ్‌టీఎల్ గుర్తించామని తెలిపారు. ప్రత్యేకంగా బఫర్ జోన్లను రెవెన్యూ అధికారులు గుర్తించాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు మరోసారి చెరువులన్నింటి వద్ద ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తిస్తాం.

ఎఫ్‌టీఎల్ పరిధిలో...

జిల్లావ్యాప్తంగా మొత్తం 1,016 చెరువులు ఉంటే ఇందులో పెద్దవి 700 వరకు ఉన్నాయి. చెరువు శిఖం భూముల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ గృహ, భవన నిర్మాణాలు చేపట్ట వద్దని భారత అత్యున్నత న్యాయస్థానం గతంలోనే తీర్పు వెలువరించింది.

చెరువుల గరిష్ఠనీటి నిల్వ ఎఫ్‌టీఎల్(ఫుల్‌ట్యాంక్ లెవల్) నిబంధనలను ఉల్లంఘించి రామగుండం నియోజకవర్గంలో గతంలో మల్కాపూర్ చెరువు, ఎన్టీపీసీ సమీపంలోని నర్రశాలపల్లి మాలకుంట చెరువుల్లో కొందరు కబ్జాదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. పెద్దపల్లిలోని బంధంపల్లి చెరువు, బందారి కుంట, రంగంపల్లి చెరువు, నిట్టూరు గ్రామ చెరువు, ఎల్లమ్మ-గుండమ్మ చెరువుల్లోనూ ఎఫ్‌టీఎల్ నిబంధనలను పలువురు తుంగలో తొక్కి నిర్మాణాలు చేపట్టినప్పటికీ పురపాలిక శాఖాధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలోని గర్రెపల్లి చెరువులో ఏకంగా ఓ స్థిరాస్తి వ్యాపారి ఎఫ్‌టీఎల్ పరిధిలో తాత్కాలికంగా రేకుల షెడ్డునే నిర్మించాడు. గట్టెపల్లి, నీరుకుళ్ల, సుల్తానాబాద్ బస్టాండ్‌కు సమీపంలోని పెద్ద చెరువు బఫర్‌జోన్లలోనూ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నప్పటికి అధికారులు ఎలాంటి కూల్చివేతలు చేపట్టకపోవడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# విద్యుత్తు సిబ్బంది ఇష్టారాజ్యం... వినియోగదారుడికి నరకప్రాయం

జుక్కల్: తెలిసో.. తెలియకో ఎన్నో పొరపాట్లు చేస్తుంటాం. తెలిశాక వాటిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మనమీదే ఉంటుంది. కానీ కరెంటోళ్ల పనితీరుతో ఓ కుటుంబం చీకట్లోకి వెళ్లింది. తప్పును ఒప్పుకోక.. బెదిరింపు చర్యలకు పాల్పడి ఓ వినియోగదారుడిని ముప్పు తిప్పలు పెట్టిన సంఘటన జుక్కల్ మండల కేంద్రంలో చోటుచేసుకొంది. బాధితుడు సుర్‌నార్ మల్హరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన ఇంటికో విద్యుత్తు మీటరు ఉంది. 2023 నవంబరు 3న బిల్లు చేతికిచ్చారు. అందులో 1136 యూనిట్ల రీడింగ్ ఉందని, రూ. 1553 బిల్లు చెల్లించాలని ఉంది. వాస్తవానికి రీడింగ్ 936 యూనిట్లే ఉంది. ఇది గమనించిన బాధితుడు రీడింగ్ ఎక్కువ కొట్టారని, బిల్లు ఎక్కువ వచ్చిందని వాపోయారు. సరే సరిదిద్దుతామంటూ 8 నెలల నుంచి సతాయిస్తున్నారు. ప్రతి నెలా బిల్లు ఇస్తూనే ఉన్నారు. చివరికి 2024 జులై 2 బిల్లు కొట్టారు. అందులోనూ 1136 యూనిట్ల రీడింగ్ ఉన్నట్లు చూపారు. 8 నెలల్లో ఒక్క యూనిట్ కూడా వాడలేదా..? అంటే అదీ లేదు. విద్యుత్తు వాడుతూనే ఉన్నారు. మీటర్‌లో రీడింగ్ పెరుగుతూనే ఉంది. కానీ బిల్లులో మాత్రం అంతే ఉంది. జులైలో రూ. 3015 బిల్లు వచ్చిందని, చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామంటూ హెచ్చరించారు. మీరు అధిక రీడింగ్ నమోదు చేసి, బిల్లు పెంచితే తామెందుకు చెల్లించాలని ప్రశ్నిస్తే జేఎల్ఎం సాయిలు బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విద్యుత్తు కనెక్షన్ తొలగించి, చీకట్లోకి నెట్టారు. గత్యంతరం లేక బెదిరింపులకు భయపడి బాధితుడు రూ. 2700 చెల్లించడంతో మళ్లీ విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. ప్రస్తుతం ఆ మీటరు రీడింగ్ 1089 యూనిట్లు చూపెడుతోంది. ఎనిమిది నెలల క్రితమే 1136 యూనిట్ల వాడకం పేరుతో బిల్లు ఇవ్వడం కొసమెరుపు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఏఈ మోహన్‌ను వివరణ కోరగా.. సమస్య తన దృష్టికి రాలేదని, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే.. రీడింగ్‌ను సరి చేసి బిల్లులో మార్పు చేస్తామని, బిల్లు తగ్గిస్తామని చెప్పారు.

# ఉపాధి.. సామాజిక ప్రగతి

సంగారెడ్డి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) అమలులో భాగంగా ప్రభుత్వం పనుల ఎంపికలో సంస్కరణలు చేపడుతోంది. ప్రస్తుతం గ్రామానికి అయిదు కిలో మీటర్ల పరిధిలో కూలీలకు సాగు కాల్వల్లో పూడిక తీత, నర్సరీల్లో మొక్కల పెంపకం, నాటడం తదితర పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది నుంచి పాత పనులు కొనసాగిస్తూనే.. సామాజిక అభివృద్ధి దిశగా ప్రగతి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా విద్య, వైద్యం, పశు సంపద, నీటి వనరుల సంరక్షణకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పల్లెల్లో ముందస్తుగా చేపట్టిన సర్వే ఆధారంగా నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాచరణ రూపొందించింది.

466 పనులు.. రూ.25.68 కోట్ల నిధులు

జిల్లాలో 25 మండలాలు... 647 గ్రామ పంచాయతీలున్నాయి. 639 పల్లెల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలవుతోంది. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద 466 పనులను గుర్తించారు. రూ.25.68 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రభుత్వ పాఠశాలల ప్రహరీలు, వంట గదుల నిర్మాణాలు, వాన నీటి సంరక్షణ పనులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో




శౌచాలయాలు, పల్లెల్లో పశువుల పాకలు, జీవాల పెంపకం, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు.

గుర్తించిన పనులిలా..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీలు: 132
వంట గదులు నిర్మాణాలు: 46
బడుల్లో శౌచాలయాలు: 94
అంగన్‌వాడీ కేంద్రాల్లో శౌచాలయాలు: 174

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– బాల్‌రాజ్, డీఆర్‌డీవో(ఏపీడీ)ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం పాత పనులతో పాటు.. సామాజిక అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం సర్వే చేసి పనులను గుర్తించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. త్వరలో మెటీరియల్ కాంపోనెంట్ కింద పనులు చేయిస్తాం. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# బాల్యానికి ఆరోగ్య రక్ష

సంగారెడ్డి: చిన్నారులే జాతి సంపద. వీరి సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. పోషణలోపంతో సతమతమవుతున్న చిన్నారులు ఇప్పటికీ ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే వారితో పాటు మిగతా చిన్నారులూ.. పోషణలోపంతో బాధపడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబరు నెలంతా పోషణ్ అభియాన్ పేరిట మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. నేటి నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది.

కార్యక్రమాలు ఇలా..

ప్రజల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, వివిధ శాఖల భాగస్వామ్యంతో నెల రోజుల పాటు పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తారు. మొదటి వారంలో ప్రజలతో మమేకమవుతారు. రెండో వారంలో పోషకాహారం ప్రాధాన్యం, అనీమియాకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. ఇదే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారు. మూడో వారం శిశువు పుట్టినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. నాలుగో వారం చేతుల శుభ్రత, డయేరియా వ్యాధి నివారణకు జాగ్రత్తలు సూచిస్తారు. పర్యావరణం, నూతన సాంకేతిక వినియోగం తదితర అంశాలనూ ఇందులో చేర్చారు.

తల్లిపాలే శిశువుకు రక్ష

తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించనున్నారు. బిడ్డకు సంపూర్ణ



ఆరోగ్యం తల్లిపాల ద్వారా చేకూరుతుంది. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టడం ద్వారా తల్లీబిడ్డలిద్దరికీ శ్రేయస్కరం. ఆరు నెలల వయసు వరకు తల్లిపాలే పట్టించాలి. వీటిలో సరిపోయే విటమిన్లు, మినరల్స్ సమపాళ్లలో ఉండటం ద్వారా శారీరక, మానసిక వికాసం వేగంగా అభివృద్ధి చెందుతుంది.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 5
అంగన్‌వాడీ కేంద్రాలు: 1,504
గ్రోత్ మేళాలో పాల్గొన్న చిన్నారులు: 88,824
వయసుకు తగిన బరువు లేనివారు: 10,645
ఎత్తుకు తగిన బరువు లేనివారు: 4,964
వయసుకు తగిన ఎత్తులేనివారు: 17,075

అవగాహనతో మార్పు...–లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి

జిల్లా వ్యాప్తంగా పోషణ మాసోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నాం. వయసుకు తగిన బరువులేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.




అమరావతి: రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలుంటాయని వాతావరణ శాఖ తెలిపిందని సీఎం చంద్రబాబు చెప్పారు. చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలపై కలెక్టర్లు, మంత్రులు, అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రభుత్వ విభాగాల సన్నద్ధతపై సమీక్షించారు. వర్షాలపై ప్రజల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపి అలర్ట్ చేయాలన్నారు. చెరువు కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టిపెట్టాలని చెప్పారు. వాగులు, కాలువల వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులు పెట్టాలని ఆదేశించారు. అప్రమత్తతతో ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చేయాలని చెప్పారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి ప్రజల వినతులపై వేగంగా స్పందించాలని చంద్రబాబు తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని చెప్పారు.

## తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసు.. లొంగిపోయిన ప్రధాన నిందితుడు




అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడు పానుగంటి చైతన్య మంగళగిరి కోర్టులో లొంగిపోయాడు. ఆయన వైకాపా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నాడు. గతంలో తెదేపా కార్యాలయంపై దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. కూటమి ప్రభుత్వం రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చైతన్య.. వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ప్రధాన అనుచరుడు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. వైకాపా నేతలు దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులు దాడి చేశారు. మరోవైపు ఈ కేసును వేగంగా విచారించేందుకు ఇటీవల సీఐడీకి అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కొన్ని సాంకేతిక కారణాలతో అప్పగించడంలో ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో మంగళగిరి పోలీసులు విచారణను కొనసాగిస్తున్నారు.

## ఎమ్మెల్యే రఘురామ కేసులో ట్విస్ట్..

అమరావతి: ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు కేసులో ట్విస్ట్ నెలకొంది. ఆయన కేసులో దర్యాప్తు అధికారిని మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రకాశం ఎస్పీ దామోదర్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు గుంటూరు జిల్లా పాలన విభాగం ఏఎస్పీ రమణమూర్తి దర్యాప్తు బాధ్యతలు చూస్తున్నారు. వెంటనే కేసు రికార్డును ప్రకాశం ఎస్పీకు అప్పగించాలని గుంటూరు అడ్మిన్ ఏఎస్పీకు ఆదేశాలు జారీ చేశారు. సీఐడీ పోలీసులు కస్టడీలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై గుంటూరు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి విజయ పాల్‌కు హైకోర్టు బెయిల్ తిరస్కరించడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తొందరపాటు చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కాగా పోలీసులు ఇటీవల విజయ పాల్‌ను విచారణకు పిలిపించారు. అయితే విజయ పాల్‌ను విచరించడంలో పోలీసులు సరిగా వ్యవహరించలేదని ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. హైకోర్టు బెయిల్ తిరస్కరించినా విజయ పాల్‌ను అరెస్ట్ చేయడంలో పోలీసులు వైఫల్యం చెందారని ఆరోపణలు వచ్చాయి. అందుకే దర్యాప్తు అధికారిని ప్రభుత్వం మార్చింది. అప్పటి నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి విజయ పాల్‌కు హైకోర్టు లో చుక్కెదురైంది. ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ప్రస్తుత




టీడీపీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజును.. సీఐడీ కస్టడీలో విజయ్‌పాల్ చిత్రహింసలు పెట్టారు. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అధికారులపై కేసు నమోదు చేయాలని గుంటూరులో రఘురామ కృష్ణంరాజు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన గుంటూరు నగరపాలెం పోలీసులు.. విజయపాల్‌తో పాటు అప్పటి సీఎం జగన్, సీఐడీ డీజీ సునీల్, ప్రభుత్వాసుపత్రి.. సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిని నిందితులుగా పోలీసులు చేర్చారు. కేసులో ముందస్తు బెయిల్ కోసం విజయపాల్ కోర్టులో పిటిషన్ వేశారు. విజయ్‌పాల్ తరఫున సుప్రీంకోర్టు కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా, పీపీ లక్ష్మీనారాయణ,.. రఘురామ కృష్ణంరాజు తరపున న్యాయవాది ఉమేష్ చంద్ర వాదనలు వినిపించారు. న్యాయస్థానం విజయపాల్‌కు బెయిల్ నిరాకరించడంతో మిగతా అధికారుల్లో వణుకు మొదలైంది.

## తక్షణమే అన్ని రక్షణ చర్యలు చేపట్టండి.. నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు మంత్రి ఆదేశం..

నెల్లూరు: ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, రెవెన్యూ, పోలీసు అధికారులతో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్‌తో మంత్రి ఆనం చర్చించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తుకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సమావేశంలో రెవెన్యూ, పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. తుపాను ప్రభావం వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని, ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని మంత్రి చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి ఆనం చెప్పుకొచ్చారు. ఆనం ఆదేశాలతో ముఖ్యంగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఆర్డీవో పావని, అధికారులు పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఇవాళ(సోమవారం) బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి, రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అలాగే విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని కొన్ని



ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉ ఒదని పేర్కొన్నారు. మరోవైపు పశ్చిమగోదావరి, కృష్ణా, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆయన చెప్పారు. బుధ, గురు వారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. భారీ వర్షాలతో నదులు, వాగులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోణంకి హెచ్చరించారు. అలాగే విద్యుత్ స్థంబాలు, విద్యుత్ తీగలు, చెట్లు, హోర్డింగ్స్ కింద ప్రజలు నిలుచోవద్దని చెప్పారు. ముఖ్యంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

## పంచాయతీ నిధుల్ని దారిమళ్లించిన ద్రోహి జగన్: మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు: పంచాయతీ నిధుల్ని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దారి మళ్లించారని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. నిధుల్ని దారి మళ్లించిన ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. పాలకొల్లు మండలం గోరింటాడ తదితర గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మంత్రి గ్రామాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పల్లె పండుగ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. “గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఎన్డీఏ సర్కార్‌తోనే సాధ్యమవుతుంది. ఒకే రోజు 13,326 పంచాయతీ గ్రామసభలు, అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడం చరిత్రాత్మకం. పల్లె పండుగలో రూ.4,500 కోట్లతో 30 వేల పనులు చేపడుతున్నాం. సంక్రాంతిలోపు గ్రామాల్లో 3 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు పూర్తిచేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసి



సర్పంచులు భిక్షాటన చేసేలా చేసింది. జగన్ పాలనలో పంచాయతీ నిధులను కూడా దారి మళ్లించారు” అని మంత్రి పేర్కొన్నారు.




## డీమార్ట్ షేర్లు డౌన్.. 27 వేల కోట్ల మేర క్షీణించిన మార్కెట్ విలువ!

దిల్లీ: డీమార్ట్ పేరిట దేశవ్యాప్తంగా రిటైల్ వ్యాపారం నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ షేర్లు సోమవారం క్షీణించాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి ప్రకటించిన ఫలితాల్లో మదుపర్లను మెప్పించడంలో కంపెనీ విఫలమవడంతో ఈ ఉదయం 9 శాతం మేర క్షీణించాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.27 వేల కోట్ల మేర ఆవిరైంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికానికి డీమార్ట్ ఏకీకృత ప్రాతిపదికన రూ.659.44 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాదితో పోలిస్తే 5 శాతం మేర పెరిగింది. ఆదాయం సైతం 14.41 శాతం పెరిగి రూ.14,444.50 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో ఖర్చులు 14.94 శాతం మేర పెరిగినట్లు నివేదించింది. ఈ ఫలితాలు మదుపర్లను మెప్పించడంలో విఫలమయ్యాయి. దీంతో బ్రోకరేజీ సంస్థలు డీమార్ట్ టార్గెట్ ప్రైస్‌ను తగ్గించాయి. ఈ కారణంగా డీమార్ట్ షేర్లు నేడు పతనమయ్యాయి. మరోవైపు క్విక్ కామర్స్ సంస్థల నుంచి డీమార్ట్‌కు ఎదురవుతున్న పోటీ కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. సోమవారం ఉదయం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో డీమార్ట్ షేర్లు 9.46 శాతం క్షీణించి రూ.4,139కు చేరగా.. బీఎస్ఈలో 9.37 శాతం క్షీణించి రూ.4,143.60 వద్ద ట్రేడయ్యాయి. కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ.27,900 కోట్లు క్షీణించి రూ.2.69 లక్షల కోట్లకు చేరింది. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి 8.30 శాతం నష్టంతో డీమార్ట్ షేర్లు ట్రేడవుతున్నాయి. మరోవైపు సెన్సెక్స్ 608 పాయింట్ల లాభంతో 81,990 పాయింట్ల వద్ద, నిఫ్టీ 170 పాయింట్ల లాభంతో 25,134 పాయింట్ల వద్ద లాభాల్లో కొనసాగుతున్నాయి.




## ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం: రోణంకి కూర్మనాథ్

అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది రాగల 48 గంటల్లో బలపడి పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, దక్షిణకోస్తా తీరాల వైపు కదిలే అవకాశం ఉందని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి, రోణంకి కూర్మనాథ్ హెచ్చరించారు. సోమవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ ఒదన్నారు. నెల్లూరు, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి, కృష్ణా, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధ, గురు వారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయన్నారు. భారీవర్షాలతో పొంగిపొర్లే వాగులు, కాలువలు, రోడ్లు ,కల్వర్టులు, మ్యాన్ హోల్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. బయట ఉన్నట్లయితే ఒరిగిన విద్యుత్ స్థంబాలు, తీగలు, చెట్లు, హోర్డింగ్స్ క్రింద ఉండరాదని హెచ్చరించారు. పాత బిల్డింగ్స్ వదిలి సురక్షిత భవనాల్లో ఉండాలని, వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు చెట్లు క్రింద, పోల్స్, టవర్స్ క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని రోణంకి కూర్మనాథ్ సూచించారు. కాగా ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకుని హిందూ మహాసముద్రం మీదుగా ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్యం దిశగా కదిలి ఆదివారం మరింత విస్తరించింది. సోమవారం దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ సంస్థ (%×వీణ%) వెల్లడించింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ఏపీ దక్షిణ కోస్తా తీరం వైపు పయనించే అవకాశాలున్నాయని ఐఎండీ తెలిపింది. దీని ప్రభావంతో రెండు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. ప్రధానంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో సోమవారం నుంచి 17వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

**వివిధ రాష్ట్రాల్లో..** ఛత్తీస్‌గఢ్, ఒడిశా, గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం, మేఘాలయ, అరుణాచల్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మహారాష్ట్ర సహా ఉత్తర బంగాళాఖాతం నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తున్నాయని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. మరో రెండు రోజుల్లో నైరుతి మరింత బలహీనపడుతుందని వివరించింది. ఇక దక్షిణ భారతదేశ ద్వీపకల్పం మీదుగా తూర్పు, ఈశాన్య గాలులు ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయని, వీటి ప్రభావంతో దక్షిణాది రాష్ట్రాలతో పాటు మధ్య బంగాళాఖాతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## ఆంధ్రప్రదేశ్‌కి వర్ష సూచన.. తితిదే కీలక నిర్ణయాలు

తిరుమల: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది.

రాగల 36 గంటల్లో భారీ వర్ష సూచనపై సమావేశంలో ఉన్నతాధికారులు చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 15న సిఫార్సు లేఖలు అనుమతించకూడదని, అలాగే భక్తుల భద్రత దృష్ట్యా బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది.






ఇజ్రాయెల్‌లోని బిన్యమిన ప్రాంతంలోని సైనిక స్థావరమే లక్ష్యంగా హెజ్‌బొల్లా మానవరహిత విమానాలు దాడి చేశాయి. ఈ ఘటనలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతిచెందగా.. దాదాపు 67 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో ఐడీఫ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జిహాలేవి మృతి చెందినట్లు తొలుత ఇంటర్నెట్‌లో ప్రచారం మొదలైంది. అమెరికా కామెంటేటర్ జాక్సన్ హింక్లె కూడా దీనిని ప్రస్తావించడంతో ఈ ప్రచారం తీవ్రమైంది. వెరిఫైడ్ ఎక్స్ ఖాతాల్లో ఈ విషయాన్ని ప్రచారం చేశారు. కొద్దిసేపటి తర్వాత ఈ ప్రచారం తప్పంటూ జెరూసలెం పోస్టు ఓ కథనం ప్రచురించింది. దాడి జరిగిన ప్రదేశం ఐడీఎఫ్ గోలాన్ బ్రిగేడ్‌కు చెందిన శిక్షణ శిబిరంలోని మెస్‌గా తెలుస్తోంది. డ్రోన్ల దండు ఏకకాలంలో విరుచుకుపడటంతో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు నిర్వీర్యమైపోయినట్లు సమాచారం. దీనిపై ఐడీఎఫ్ ప్రతినిధి హగారీ స్పందిస్తూ.. తమకు ఈ యుద్ధంపై పూర్తిగా పట్టు ఉందని ప్రకటించారు. దాడి చేసిన మానవ రహిత విమానం తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ఎలా తప్పించుకొందో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్‌పై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది కూడా ఒకటి. హెజ్‌బొల్లా అమ్ములపొదిలోని మిర్సాద్-1 రకం డ్రోన్లుగా వెల్లడించారు. ఈ డ్రోన్ 120 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై గంటకు 370 కిలోమీటర్ల వేగంతో దాడి చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనిలో దాదాపు 40 కిలోల పేలుడు పదార్థాలను అమర్చవచ్చని తెలిపారు. ఇది దాదాపు 3,000 మీటర్ల ఎత్తు వరకు ఎగరగలదు. ఇది ఇరాన్‌కు చెందిన సూసైడ్ డ్రోన్ మొహాజిర్-2 శ్రేణికి చెందినది. హెజ్‌బొల్లా ప్రధాన డ్రోన్ కూడా ఇదే. దీనిని 2002 నుంచి హెజ్‌బొల్లా వాడుతోంది. హెజ్‌బొల్లా భారీ సంఖ్యలో రాకెట్లతో కలిపి ఈ డ్రోన్లను ప్రయోగించడంతో ఇజ్రాయెల్ అడ్డుకోలేకపోయిందని నిపుణులు చెబుతున్నారు. తమ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలను ఇది తప్పించుకోవడం ఇదే తొలిసారి అని టెల్ అవీవ్ సైనిక నిపుణులు వెల్లడించారు.

## బ్లాక్ చీరలో మెరిసిన అందాల చౌదరి

తెలుగు ప్రేక్షకులకు మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. టాలీవుడ్‌లో అడుగు పెట్టిన తక్కువ సమయం లోనే ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు వంటి పెద్ద హీరోతో కలిసి నటించే అవకాశం దక్కించుకుంది. అంతే కాకుండా కోలీవుడ్ సూపర్ స్టార్ తో రొమాన్స్ చేసిన అరుదైన ఘనత సైతం దక్కించు కుంది. కోలీవుడ్, టాలీవుడ్ సినిమాలతో బిజీ బిజీగా ఉన్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి సోషల్ మీడియాలో రెగ్యులర్ గా షేర్ చేసే అందాల ఫోటో షూట్స్ వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోలతో కుర్రకారుకు మీనాక్షి మతి పోగొడుతుంది. 2018 ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి అందాల కిరీటంను సొంతం చేసుకుంది. మిస్ ఇండియాగా నిలిచిన మీనాక్షి చౌదరి ఇండస్ట్రీలో అడుగు పెట్టి మెల్లమెల్లగా సినిమాలు చేస్తూ వస్తోంది. తెలుగులో ఈ అమ్మడు 2021లో ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన మీనాక్షి చౌదరికి మాత్రం నటిగా మంచి గుర్తింపు దక్కింది. తన అందంతో ఎంతో మంది ఫిల్మ్ మేకర్స్ దృష్టిని



ఆకర్షించింది. ఆ సమయంలోనే త్రివిక్రమ్ తో ప్రశంసలు అందుకుని తప్పకుండా ఆఫర్ ఇస్తాను అనే హామీని తీసుకుంది. కేవలం తెలుగు సినిమాలకు పరిమితం కాకుండా ఇతర భాషల్లోనూ సినిమాలు చేస్తూ కెరీర్‌లో ముందుకు వెళ్తున్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన బ్లాక్ చీర కట్టు ఫోటోలు నెటిజన్స్ చూపు తిప్పనివ్వడం లేదు. రెగ్యులర్‌గా మోడ్రన్ డ్రెస్‌ల్లో కనిపించి కన్నుల విందు చేసిన మీనాక్షి చౌదరి ఈసారి చీర కట్టులో కనిపించడం ద్వారా మరింత అందంగా కనిపించింది. మీనాక్షి ని చూడ్డానికి రెండు కళ్లు చాలడం లేదు అంటూ పలువురు నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఫోటోలు లైక్ చేసి షేర్ చేస్తూ ఉన్నారు. మీనాక్షి చౌదరి తాజాగా విజయ్ తో నటించిన దిగోట్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దాంతో కోలీవుడ్‌లో ఈమెకు మరిన్ని ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తోంది. ముందు ముందు తమిళనాట ఈమె స్టార్ హీరోలతో పాటు, టాలీవుడ్‌లో స్టార్ హీరోలతో వరుసగా సినిమాలు చేయడం ఖాయం. చిన్న సినిమాలతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి స్టార్ హీరోలకు జోడీగా నటించడం అనేది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. మీనాక్షి చౌదరి విషయంలో అదే జరగబోతుంది అనే అభిప్రాయంను ఆమె ఫ్యాన్స్ తో పాటు సినీ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

## రాజమౌళి.. ఈ లుక్కులో కేక

మన గ్లోబల్ దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి మాత్రం ఒక దర్శకుడిగా కాకుండా ఒక స్పెషల్ లుక్ లో కనిపించి అందరిని ఆశ్చర్యపరిచారు. రాజమౌళి తన దర్శక ప్రతిభతో తెలుగు సినిమా స్థాయిని గ్లోబల్ లెవెల్లో నిలబెట్టారు. 'బాహుబలి' సిరీస్ తో ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ఆయన, 'ఆర్ఆర్ఆర్'తో ఆస్కార్ స్థాయి విజయం సాధించి దాదాపుగా అన్ని గౌరవాలను సొంతం చేసుకున్నారు. అయితే రాజమౌళి దర్శకుడిగానే కాకుండా ఒకట్రెండు సినిమాలలో నటనతో కూడా ఎట్రాక్ట్ చేశాడు. ఇటీవల ఆయన ప్రభాస్ హీరోగా వచ్చిన 'కల్కి 2898 ఏ.డి' చిత్రంలో ఒక కీలక క్యామియో పాత్రలో కనిపించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో రాజమౌళి లుక్ ని మొదట సీక్రెట్ గా ఉంచారు. కానీ సినిమా చూశాక అందరూ ఫిదా అయ్యారు. తాజాగా, ఆయన లుక్ కి సంబంధించిన స్టిల్స్ బయటకు రావడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్



అవుతున్నాయి. ఈ చిత్రంలో జక్కన్న బ్రౌన్ టీ షర్ట్ మరియు స్టైలిష్ జాకెట్ లో కనిపించారు. ఈ లుక్ లో ఆయన పూర్తిగా మాస్ అవతారంలో ఉన్నారని చెప్పుకోవచ్చు. ఈ లుక్ చూసిన అభిమానులు ఆయన నెక్స్ట్ కల్కి పార్ట్ 2 ప్రాజెక్టులో కూడా ఇలాగే ఉండాలని ఆశిస్తున్నారు. రాజమౌళి లాంటి లెజెండరీ దర్శకుడు ఇలా ఒక స్పెషల్ పాత్రలో కనిపించడం అభిమానులను ఖుషీ చేస్తోంది. ఇది ఇలా ఉ ండగా, రాజమౌళి తన నెక్స్ట్ ప్రాజెక్టును సూపర్ స్టార్ మహేష్ బాబు తో చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుపై ఇప్పటినుంచే భారీ అంచనాలు ఉన్నాయి. మహేష్ బాబు కెరీర్ లో ఇది మరో ల్యాండ్ మార్క్ మూవీగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ సినిమా హాలీవుడ్ స్థాయి యాక్షన్ అడ్వెంచర్ గా తెరకెక్కనుంది.

అంతేకాకుండా ఇది మహేష్ బాబు మొదటి పాన్ వరల్డ్ సినిమా కావడం విశేషం. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా 2025లో ప్రారంభం కానుంది. సినిమా యూనిట్ ఇప్పటినుంచే అన్ని ఏర్పాట్లు చేస్తూ చిత్రీకరణకు సిద్ధం అవుతోంది. ఇకపోతే, ఈ సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం ఫైనల్ స్టేజ్ లో ఉంది. సినిమా షూటింగ్ వచ్చే ఏడాది మధ్యలో ప్రారంభం కానుంది, ఇక సినిమా విడుదలకు మూడేళ్ళ సమయం పట్టవచ్చు.




# నెక్స్ట్ లైన్ లో మహేష్, పవన్, చరణ్..!



స్టార్ సినిమా అంటే చాలు బడ్జెట్ కి తగినట్టుగానే రెండు భాగాలుగా మూవీ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. బాహుబలి తో మొదలైన ఈ పంథా దేవర వరకు కొనసాగింది. బాహుబలి 1, 2 ఆ తర్వాత కె.జి.ఎఫ్, పుష్ప ఇప్పుడు దేవర ఇలా అన్ని సినిమాలు ఒకే తరహాలో వస్తున్నాయి. కథను పొడిగించి రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నారు. ఐతే ఇప్పటి వరకు టాలీవుడ్ లో ప్రభాస్, ఎన్ టీ ఆర్, అల్లు అర్జున్ లు మాత్రమే ఇలా రెండు భాగాలుగా సినిమాలు చేశారు. ఇప్పుడు పవన్ కూడా అదే పంథాల్ వీరమల్లు సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నారు. ఐతే ఈ లిస్ట్ లో చేరాల్సిన ఇంకా ఇద్దరు స్టార్స్ ఉన్నారు. వారిలో ఒకరు మహేష్, మరొకరు చరణ్ కనిపిస్తున్నారు. మహేష్ తో రాజమౌళి చేసే సినిమా కచ్చితంగా ఒక భాగంగా వచ్చే ఛాన్స్ లేదు. ఈ సినిమాను రాజమౌళి ఎన్ని భాగాలుగా ప్లాన్ చేస్తున్నారు అన్నది తెలియాల్సి ఉంది. ఇక చరణ్ కూడా ఇప్పటివరకు రెండు భాగాల సినిమాలు చేయలేదు. ఒకవేళ బుచ్చి బాబుతో చేసే సినిమా ఏమైనా అలాంటి ప్లాన్ ఉంటుందేమో చూడాలి. బాహుబలి తో మొదలైన ఈ రెండు భాగాల సెంటిమెంట్ కలిసి వస్తుండటం వల్ల కొనసాగిస్తున్నారు. ఐతే మధ్యలో రవితేజ ఈగల్ అలాంటి ప్లాన్ చేసినా వర్క్ అవుట్ కాలేదు. ఈగల్ 2 ప్రయత్నాలు దాదాపు ఆగిపోయినట్టే అని చెప్పొచ్చు. ఈగల్ సినిమా ముందే రెండు భాగాలని ప్రకటించలేదు. థియేటర్ కి వెళ్లిన ఆడియన్స్ కి షాక్ ఇచ్చారు. కేవలం చరణ్, మహేష్ లు మాత్రమే ఈ రెండు భాగాల సినిమాలు చేయట్లేదు. మహేష్ జక్కన్న మూవీ ఎలాగు నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతుంది. చరణ్ ఆర్సీ 16 సినిమా ప్లానింగ్ కూడా వేరే లెవెల్ లో ఉంది. మరి ఈ సినిమాలు నిజంగానే రెండు పార్టులుగా చేస్తారా లేదా అన్నది చూడాలి. మహేష్, చరణ్ కూడా ఇలా తమ సినిమాను రెండు ముక్కలుగా రిలీజ్ చేస్తే ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే లెక్క.

# వీరమల్లు అగ్ని బాణాలు.. స్టన్నింగ్ లుక్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా హరిహర వీరమల్లుపై అంచనాలు అయితే గట్టిగానే ఉన్నాయి. విడుదల విషయంలో జాప్యం జరుగుతున్నా కూడా మేకర్స్ ఇస్తున్న అప్డేట్స్ తో సినిమాపై బజ్ అస్సలు తగ్గడం లేదు. పవన్ కళ్యాణ్ ఈ చిత్రంలో ఒక చారిత్రక యోధుడి పాత్రను పోషిస్తున్నారు. హరిహర వీరమల్లు అనే పేరుకు తగ్గట్టుగా, ఈ సినిమా సామ్రాజ్యవాదులు మరియు వారి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఒక సామాన్యుడు చేసిన అలుపెరగని పోరాటాన్ని చూపుతుంది. ఇక సినిమాలో ఒక వార్ ఎపిసోడ్ ను హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో చిత్రీకరించారు, ఇందులో 400 – 500 మంది ఆర్టిస్టులు పాల్గొన్నారు. సినిమాకు సంబంధించి లేటెస్ట్ అప్డేట్ ప్రకారం, అక్టోబరు 14 నుంచి సినిమా కొత్త షెడ్యూల్ మొదలవుతోంది, మరియు నవంబర్ 10 నాటికి పూర్తిస్థాయి షూటింగ్ పూర్తి చేయాలని చిత్ర యూనిట్ యోచిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టు 2025 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఇక లేటెస్ట్ గా మేకర్స్ స్పెషల్ స్టిల్ విడుదల చేశారు. ఈ స్టిల్ చూసిన అభిమానులంతా రివల్యూషనరీ యోధుడిని చూసినట్లుగా భావిస్తున్నారు. ఫోటోలో పవన్ కళ్యాణ్ తన చేతిలో వున్న విల్లు నుండి మూడు అగ్నితో కూడిన భాణాలను విసురుతూ దృఢంగా నిలబడ్డారు. ఈ స్టిల్ పవన్ కళ్యాణ్ అభిమానులలో మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాకు మరో ప్రత్యేకత ఏమిటంటే, పవన్ కళ్యాణ్ స్వయంగా ఒక పాటను ఆలపించారు. తెలుగులో ఈ పాటను ఆయన పాడగా, ఇతర భాషలలో ఇతర ప్రముఖ గాయకులు పాడారు. ఇది పవన్ అభిమానులకు ఒక అదనపు ట్రీట్‌గా నిలవనుందట. మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్న ఈ సంగీతం ప్రపంచస్థాయి ప్రమాణాలను కలిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. హరిహర వీరమల్లు కథాంశం సామ్రాజ్యవాదుల పాలన మరియు వారి అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే ఒక యోధుడి చుట్టూ తిరుగుతుంది. పవన్ కళ్యాణ్ ఈ సినిమాలో సామాన్యుడి పాత్రలో ఉండి, అతని పరాక్రమాన్ని మలచిన యోధుడిగా మారతాడు. తన యుద్ధతత్వం మరియు చతురతతో ఆయన ఏ విధంగా తన గమ్యాన్ని చేరుకుంటాడన్నది ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న ప్రధాన కథాంశం. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ఇతర కీలక పాత్రల్లో అనుపమ్ ఖేర్, కోట శ్రీనివాసరావు, మురళీ శర్మ తదితరులు కనిపించనున్నారు.

## గ్లామర్ డోస్.. అందరూ ఒకేలా ఉండరు

సౌత్ లో బ్యూటీఫుల్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న అందాల భామ మాళవిక మోహనన్. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్ కూతురుగా ఆమె ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. మొదటి చిత్రాన్ని మలయాళంలో దుల్కర్ సల్మాన్ కి జోడీగా మాళవిక మోహనన్ చేసింది. 2013లో ఈ మూవీ రిలీజ్ అయ్యింది. మరోవైపు 2017 లో 'బియాండ్ ది క్లౌడ్' అనే మూవీతో మాళవిక మోహనన్ బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. తరువాత సూపర్ స్టార్ రజినీకాంత్ 'పెట్ట', విజయ్ 'మాస్టర్', ధనుష్ 'మారన్' సినిమాలలో మాళవిక మోహనన్ తమిళంలో వరుసగా నటించింది. ఈ సినిమాలతోనే అమ్మడు స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. సినిమాలలో మామూలుగానే కనిపించిన కూడా మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోషూట్ లతో సందడి చేస్తూ ఉంటుంది. రెగ్యులర్ హాట్ ఫోటోషూట్ లతో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే మాళవిక 'ది రాజాసాబ్' మూవీలో ప్రభాస్ కి జోడీగా నటిస్తోంది. ఈ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతోన్న నేపథ్యంలో మూవీ పైన చాలా హెూప్స్ పెట్టుకుంది. ఈ ఏడాది చియాన్ విక్రమ్



'తంగలాన్' చిత్రంలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో మాళవిక మోహనన్ నటించి మెప్పించింది. ఇదిలా ఉంటే మాళవిక మోహనన్ గ్లామర్ తో పాటు అప్పుడప్పుడు తన మాటలతో కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. గతంలో లేడీ సూపర్ స్టార్ నయనతార మీద మాళవిక వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలు ఎంత సంచలనం అయ్యాయో అందరికి తెలిసిందే. ఇదిలా ఉంటే తాజాగా ఈ బ్యూటీ ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్స్ గ్లామర్, ప్రేక్షకుల అభిరుచి గురించి చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. మలయాళంలో హీరోయిన్ గా పరిచయం అయినపుడు తన బాడీ, లుక్ పరంగా ట్రోలింగ్ ఎదుర్కొన్నట్లు తెలిపింది. సన్నగా ఉండటం వలన అప్పుడు తనని అందరూ ట్రోల్ చేసారని పేర్కొంది. ఒక్కో ఇండస్ట్రీలో ఆడియన్స్ కి హీరోయిన్స్ గ్లామర్ విషయంలో ఒక్కో రకమైన టేస్ట్ ఉంటుందని అన్నారు. బాలీవుడ్ లో ఒక అథ్లెట్ తరహా ఫిజిక్ తో ఉంటే ఆడియన్స్ ఇష్టపడతారని చెప్పింది. అయితే తమిళ్, తెలుగు భాషలలో కాస్తా బొద్దుగా, చబ్బీగా ఉండే హీరోయిన్స్ ని ఎక్కువ లైక్ చేస్తారని తెలిపింది. మలయాళంలో కూడా సన్నగా ఉండే హీరోయిన్స్ ని చూడటానికి ఇష్టపడరని మాళవిక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## బాలకృష్ణ కోసం మరో మాస్ టైటిల్

నందమూరి బాలకృష్ణ, యంగ్ డైరెక్టర్ బాబీ (కేఎస్ రవీంద్ర) కాంబినేషన్ లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ సినిమా పై మాస్ ప్రేక్షకుల్లో అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నాగ వంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. 'ఎన్బీకే 109' గా పిలవబడుతున్న ఈ సినిమా అప్‌డేట్స్‌పై ఇప్పటికే అభిమానులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. తాజాగా, సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేయడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా టీజర్ కూడా విడుదల చేయనున్నారు. ఇక ఫిల్మ్ సర్కిల్స్ లో అందిన సమాచారం ప్రకారం మాస్ టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కథకు తగ్గట్టుగా ఉండేలా, 'సర్కార్ సీతారాం' అనే టైటిల్‌ను లాక్ చేసారట. బాలకృష్ణ మాస్ ఇమేజ్ ను దృష్టిలో ఉంచుకొని పలు రకాల టైటిల్స్ పరిశీలించినా చివరికి ఈ టైటిల్‌కే ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఈ టైటిల్ బాలయ్య కెరీర్‌లో ఒక కొత్త ఎలివేషన్‌ను తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలో బాలకృష్ణ రోల్ ఎంతో ఆసక్తికరంగా ఉండబోతుందని సమాచారం. రాజస్తాన్ నేపథ్యంలో సాగే ఈ సినిమా కథలో బాలయ్య పాత్ర మాస్ ప్రేక్షకులకు ఎంతో విభిన్న అనుభూతిని పంచబోతుంది. చిత్రంలో బాలకృష్ణ సరసన బాలీవుడ్ బ్యూటీ ఊర్వశీ రౌతెలా నటిస్తుండగా, ఇతర ముఖ్యపాత్రలో



చందినీ చౌదరి కనిపించబోతున్నారు. చిత్రంలో మరో ప్రత్యేక ఆకర్షణగా బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ కనిపించనున్నారు. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమా, ఆయన నటనకు మరో కొత్త రంగును తీసుకురానుందని భావిస్తున్నారు. 'సర్కార్ సీతారాం' చిత్రంలో బాలయ్య పాత్రను ప్రేక్షకులు ఎంజాయ్ చేసే విధంగా స్టైలిష్ గా, అలాగే పవర్‌ఫుల్ మాస్ లుక్ లో చూపించబోతున్నారు. సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలు ప్రారంభించి, మరిన్ని అప్‌డేట్స్ ను వెల్లడించనుంది. ఈ సినిమాకి సంగీతం అందిస్తోన్న ఎస్. థమన్ ఇప్పటికే మూడు పాటలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సినిమాకు బలమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం వర్క్ చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ కార్తిక్ కన్నన్ అందిస్తున్నారు. సంక్రాంతి 2025 సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అనుకుంటోంది. సంక్రాంతి బరిలో రామ్ చరణ్ నటిస్తున్న 'గేమ్ చేంజర్' కూడా విడుదల కానుండగా, ఈ పోటీలో బాలయ్య సినిమా ఎలాంటి ప్రభావం చూపుతుందో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాలయ్య ఫ్యాన్స్ మాత్రమే కాకుండా, అన్ని వర్గాల మాస్ ప్రేక్షకులు సైతం సంక్రాంతికి 'సర్కార్ సీతారాం' సినిమాను చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి.. క్యాట్‌లో ఐఏఎస్ అధికారుల పిటిషన్లు

దిల్లీ: కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఆదేశాలతో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లలో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఓపీటీ కార్యదర్శి ఆదేశాలు సైతం జారీ చేశారు. అయితే డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన క్యాట్‌లో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు. తెలంగాణలో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి కోరారు. ఏపీలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఐఏఎస్ అధికారిణి సృజన కోరారు. వారి పిటిషన్లపై కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ మంగళవారం విచారణ చేపట్టనుంది.

ఏపీకి కేటాయించి తెలంగాణలో కొనసాగుతున్న వారిలో ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, ప్రశాంతి, ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారిలో ఐఏఎస్ అధికారులు సృజన, శివశంకర్, హరికిరణ్ ఉన్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లాలని దరఖాస్తు పెట్టుకున్న ఎస్.ఎస్.రావత్, అనంతరాము అభ్యర్థనలను డీవోపీటీ తిరస్కరించింది. వీరిద్దరూ ఆంధ్రాలోనే కొనసాగుతారు.




ముంబయి: ఎన్సీపీ కీలక నేత, బాలీవుడ్ మిత్రుడు, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ (66) హత్యతో ముంబయి నగరం ఉలిక్కిపడింది. ఆ కేసును విచారిస్తోన్న పోలీసులకు మరో కీలక విషయం తెలిసినట్లు సమాచారం. ఆయన కుమారుడు, ఎమ్మెల్యే జీషన్ సిద్ధిఖీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తండ్రీ కుమారులను చంపేందుకు కాంట్రాక్టు ఇచ్చినట్లు షూటర్లు విచారణలో పేర్కొన్నట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. హత్య జరిగిన ప్రాంతంలోనే సిద్ధిఖీ, ఆయన కుమారుడు ఉంటారని తమకు ఆదేశాలు ఇచ్చిన వ్యక్తులు చెప్పారని షూటర్స్ వెల్లడించారు. ఇద్దరిపైనా దాడి చేసే వీలులేకపోతే.. ఎవరు దొరికితే వారిని హత్య చేయాలని చెప్పినట్లు దర్యాప్తులో వెల్లడించారు. జీషన్ సిద్ధిఖీ కాంగ్రెస్ టికెట్‌పై వండ్రే ఈస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డాడన్న ఆరోపణలతో పార్టీ ఆయన్ను బహిష్కరించింది. ముగ్గురు దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరపడంతో బాబా సిద్ధిఖీ ప్రాణాలు కోల్పోయారు. దుండగులు ఆయనపై కాల్పులు జరుపుతున్న సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు వినిపించలేదు. ఇది ఒక కిరాయి హత్యని, వ్యాపార లావాదేవీల్లోగానీ, మురికివాడ అభివృద్ధి ప్రాజెక్టులో విభేదాలవల్లగానీ జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సిద్ధిఖీని తామే చంపామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. వచ్చే నెలలో ఎన్నికలు జరిగే అవకాశమున్న మహారాష్ట్రలో చోటుచేసుకున్న ఈ హత్య కలకలం రేపుతోంది.

## ఆలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం: కిషన్‌రెడ్డి



వరంగల్: దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఆలయాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. భద్రాచలం, రామప్ప, జోగులాంబ, బల్కంపేట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వెయ్యి స్తంభాల మండపంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. “దేశ వ్యాప్తంగా 150 దేవాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం. ఇప్పుడు యువత కూడా పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోంది. పెద్దలపై గౌరవం, దేశభక్తి, సమాజంపై బాధ్యత పెంచుకోవాలి. మరింత అంకితభావం, చిత్తశుద్ధితో దేశాభివృద్ధికి కృషి చేస్తాం. మోదీ ప్రభుత్వ హయాంలోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం” అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




ముంబయి: మహారాష్ట్ర లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముంబయి నగరంలోకి ప్రవేశించే టోల్ ప్లాజాల వద్ద లైట్ మోటార్ వాహనాలకు ఇకపై టోల్ ఫీజు వసూలుచేయబోమని ప్రకటించింది. కార్లు, ఎస్‌యూవీలకు మాత్రమే ఈ నిర్ణయం వర్తిస్తుంది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఇది అమల్లోకి రానుంది. మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. సోమవారం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే (%జవీ జుఎఅఫ్త్ర రాష్ట్రఅఅనవ%) నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. థానే నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న శిందే.. గతంలో చాలాసార్లు టోల్ వసూళ్లకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. ఇప్పుడు వాటిని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏక్‌నాథ్ శిందే ప్రభుత్వానికి ఇదే చివరి మంత్రివర్గ సమావేశం. ఇక మహారాష్ట్ర స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ పేరు మార్చుతూ ఈ మంత్రివర్గ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల కన్నుమూసిన రతన్ టాటా గౌరవార్థం ఈ యూనివర్సిటీకి ఆయన పేరును పెట్టారు. ‘రతన్ టాటా స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ’గా దీనిని మార్చారు.

**ఆ ఐదు టోల్‌ప్లాజాల వద్ద..** తాజా నిర్ణయంతో వాహనదారులకు ఐదు టోల్‌ప్లాజాల వద్ద టోల్ రుసుముల నుంచి విముక్తి లభించనుంది. దహిసర్, ములుండ్, వాషి, ఐరోలి, తిన్హంత్ నాకాల్లో కార్లు, ఎస్‌యూవీలు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇక్కడ ప్రస్తుతం టోల్ ఫీజుగా రూ.45 వసూలు చేస్తున్నారు. ముంబయి నగరంలోకి చిన్న వాహనాలతో ప్రవేశించే రోజువారీ ప్రయాణికులకు ఇది ఊరట కలిగించే నిర్ణయమని పలువురు పేర్కొంటున్నారు.

**ప్రజల దృష్టిని మళ్లించేందుకే..** మరోవైపు ఏక్‌నాథ్ శిందే ప్రభుత్వం టోల్ రుసుములు తొలగిస్తూ తీసుకున్న నిర్ణయంపై విపక్షాలు మండిపడ్డాయి. ఎన్నికలకు ముందు ఇది పొలిటికల్ స్టంట్ అంటూ విమర్శించాయి. మహారాష్ట్రలో ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య ఘటన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని శివసేన(యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది ఆరోపించారు. మహారాష్ట్ర, ఝూర?ండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ‘కేంద్ర ఎన్నికల సంఘం’ ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

నవంబర్ రెండు లేదా మూడో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీటితో పాటు వివిధ రాష్ట్రాల్లోని 45 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు సైతం జరపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామా చేసిన కేరళలోని వయనాడ్ నియోజకవర్గం కూడా ఉంది.




## కొండా సురేఖపై కేటీఆర్ పిటిషన్.. 18న సాక్షుల వాంగ్మూలం నమోదు

హైదరాబాద్: మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది.

ఈనెల 18న కేటీఆర్‌తో పాటు నలుగురు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేస్తామని కోర్టు తెలిపింది. పిటిషనర్‌తో పాటు సాక్షులుగా ఉన్న బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్ వాంగ్మూలాను నమోదు చేయనున్నట్లు వెల్లడించింది. తదుపరి విచారణ 18కి వాయిదా వేసింది.

## ఆయన అనుభవించిన క్షోభకు ఎవరు సమాధానం చెబుతారు?: హరీశ్‌రావు







దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతదేహానికి పౌర హక్కులు, ప్రజాసంఘాల నేతలు, రాజకీయ ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, దేశపతి శ్రీనివాస్, కే కేశవరావు తదితరులు.. హైదరాబాద్ మౌలాలిలో సాయిబాబా కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారం క్రితం అనారోగ్య సమస్యలతో నిమ్స్ ఆస్పత్రిలో చేరిన సాయిబాబా చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం గన్‌పార్క్ వద్ద అభిమానుల సందర్శనార్థం భౌతిక కాయాన్ని ఉంచిన కుటుంబ సభ్యులు.. అనంతరం ఇంటికి తరలించారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత గాంధీ ఆస్పత్రికి ప్రొఫెసర్ సాయిబాబా మృతదేహాన్ని అప్పగించనున్నారు. అక్రమ నిర్బంధమే సాయిబాబా మృతికి కారణమని కేంద్ర ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని పలువురు డిమాండ్ చేశారు.

## సికింద్రాబాద్ మోండ మార్కెట్ వద్ద టెన్షన్.. టెన్షన్..




హైదరాబాద్: సికింద్రాబాద్ కూర్మగూడలో టెన్షన్ నెలకొంది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి విగ్రహం ధ్వంసం చేశారు. విషయం పసిగట్టిన స్థానికులు దుండగులను పట్టుకునే ప్రయత్నం చేశారు.. నిందితుల్లో ఒకరిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఎలాంటి గొడవలు జరగకుండా కట్టుదిట్టం చేశారు. పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సికింద్రాబాద్ మోండ మార్కెట్ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద హై టెన్షన్ నెలకొంది. అమ్మవారి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ హిందూ సంఘాలు ఆందోళన చేపట్టాయి. బీజేపీ కార్పొరేటర్లు, వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగాయి. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే గణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు. మాజీ మంత్రి తలసాని మాట్లాడుతూ.. మత విద్వేషాలను ప్రేరేపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. నిన్నటి వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో దుర్గామాత నవరాత్రులు, బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారని.. విగ్రహం ధ్వంసం చేయడం ఒక వర్గం మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. దోషులు ఎంతటివారైనా పోలీసులు కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోసారి డిమాండ్ చేశారు.

## స్పెషల్ బస్సుల పేరుతో విపరీతంగా పెంచిన ఆర్టీసీ ఛార్జీలు.. మండిపడ్డ హరీశ్‌రావు



హైదరాబాద్ : సామాన్యుల జేబులను ఖాళీ చేసేలా.. టీజీఎస్ ఆర్టీసీ టికెట్ ధరలను పెంచింది. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆర్టీసి టికెట్ ధరలు విపరీతంగా పెంచి బతుకమ్మ, దసరా పండుగ సమయంలో సొంతూళ్ళకు వెళ్లిన ప్రయాణికుల నుండి ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం అని ధ్వజమెత్తారు. టికెట్ ధర రూ. 140తో జేబీఎస్ నుండి సిద్దిపేటకు వెళ్లిన ప్రయాణికుడు తిరుగు ప్రయాణంలో టికెట్ ధర రూ. 200 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. హనుమకొండ నుండి హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణం సాధారణ రోజుల్లో రూ. 300 ఉంటే, పండుగ వేళ రూ.420కి ఛార్జీలు పెంచిందని తెలిపారు. బస్సుల సంఖ్య పెంచకుండా, టికెట్ ఛార్జీలు పెంచి తెలంగాణ ప్రజలకు పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమే ప్రజా పాలనన ముఖ్యమంత్రి గారు..? అని హరీశ్ రావు ప్రశ్నించారు.

## దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం : కేటీఆర్



హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో రాడార్ స్టేషన్ ఏర్పాటును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవైపు మూసీకి మరణ శాసనం రాస్తూ మరోవైపు సుందరీకరణ ప్రాజెక్టా..? వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ అంతర్థానం.. పదేళ్లు మాపై ఒ త్తిడి చేసినా రాడార్ స్టేషన్‌కు మేం ఒప్పుకోలేదు.. అంగీకరించలేదు. జనావాసాలు లేని ద్వీపాల్లో ఏర్పాటు చేయాల్సిన రాడార్ తెలంగాణలోనా..? ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు. గంగా నదికి ఒక న్యాయం.. మూసీకి ఒక న్యాయమా..? రాడార్ స్టేషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలతో కలిసి పోరాటం చేస్తాం. దామగుండంలో రాడార్ స్టేషన్‌ను మా పార్టీ వ్యతిరేకిస్తోంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పాలనపై నిరసనలకు సిద్ధమవుతున్న ప్రజలు.. ముఖ్రాకే వాసులకు కేటీఆర్ మద్దతు



హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయాలంటూ పోరుబాటపట్టిన ఆదిలాబాద్ జిల్లా ముఖ్రా కే గ్రామస్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి 300 రోజులైనా హామీలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ మోసపూరిత హామీలు ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు నిరసనలకు సిద్ధమతున్నారని ఎక్స్ వేదికగా చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలంటూ ముఖ్రా కే గ్రామానికి చెందిన ప్రజలు వినూత్నంగా నిరసన వ్యక్తంచేశారు. హామీలను గుర్తుచేస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, సీనియర్ నేత సోనియా గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తరాలు పంపించారు.

## గుడి ముందు మాంసం కవర్.. ఆ తరువాత ఏం జరిగిందంటే



హైదరాబాద్: మాసబ్‌ట్యాంక్ దగ్గర ఓ గుడి ముందు మాంసం కవర్ పడి ఉండటంపై భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. ఎవరో కావాలని చేసిన పనిగా అనుమానించారు. అయితే ఈ ఘటనపై హైదరాబాద్ పోలీసులు సోమవారం స్పందించారు. గుర్తు తెలియని వ్యక్తులు మాంసం కవర్‌ని పడేశారనడం పూర్తిగా అవాస్తవమని తేల్చారు. ఇందుకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని విడుదల చేశారు. ఓ భక్తుడి నుంచి విషయం తెలియగానే తొలుత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం దర్యాప్తు చేపట్టారు. అయితే ఆలయానికి సమీపంలో ఉన్న చెత్త కుప్పలో నుంచే ఆ కవర్ వచ్చి ఉంటుందని అనుమానించారు. దీంతో అంతకుముందు రాత్రి ఏం జరిగిందనేది తెలుసుకోవడానికి సీసీ కెమెరా ఫుటేజ్ చెక్ చేశారు. శునకాల గుంపు అటుగా వెళ్తుండటం సీసీ కెమెరాలో రికార్డయింది. అందులోని ఓ కుక్క మాంసం కవర్‌ని నోట కరుచుకుని రోడ్డుకు మరోవైపు దాటింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com